

కుమార్తెను స్మరించుకుంటూ..!



లక్ష్మణ్, సుబ్బాయమ్మ దంపతులు (ఫైల్ ఫొటో)

- పిండ ప్రదానం చేయడానికి వెళుతూ మార్టూరు వద్ద రోడ్డు ప్రమాదం
- ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురి దుర్మరణం
- కొరమేనుగుంటలో విషాదం



ప్రమాదంలో దెబ్బతిన్న కారు



ప్రమాద స్థలంలో గణేష్ బాబు, పద్మజ దంపతులు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పదేళ్ల కిందట మృతిచెందిన కుమార్తె గీతను స్మరించుకుంటూ.. కోటిలింగాల రేవులో పిండ ప్రదానం చేయడానికి బయలుదేరిందా కుటుంబం. బాపట్ల జిల్లా మార్టూరు సమీపంలోని కోళ్లపూడి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదం.. ఆ కుటుంబాన్ని తీవ్ర విషాదంలో నింపింది. ఆ కుటుంబానికి చెందిన ముగ్గురు మృత్యువాత పడటంతో తిరుపతి నగరం కొరమేనుగుంటలో విషాదం నెలకొంది. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన దామెర్ల లక్ష్మణ్, ఆయన భార్య సుబ్బాయమ్మ రెండు దశాబ్దాల కిందట తిరుపతికి వలసొచ్చారు. పోస్టల్ కాలనీలో ఉంటూ రేడియేటర్లు రిపేరు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరి పెద్ద కుమారుడు దామెర్ల గణేష్‌బాబు కొరమేనుగుంటలో నివాసం ఉంటూ, ఆటోనగర్‌లో మెకానిక్ షెడ్డు పెట్టుకున్నారు. ఇతడికి భార్య పద్మజ, కుమారులు హేమంత్, పవన్ ఉన్నారు. చిన్నకుమారుడు ధనంజయతోపాటు లక్ష్మణ్ దంపతులు ఉంటున్నారు. ఈయన కుమార్తె గీత పదేళ్ల కిందట మృతిచెందారు. ఆమెను స్మరించుకుంటూ ఏటా తిరుపతి లోఉని కపిలతీర్థంలో పిండ ప్రదానం చేసేవారు. ఈ ఏడాది మహాలయ అమావాస్య కావడంతో పెద్దల సూచన మేరకు పిఠాపురంలోని కోటిలింగాలలో పిండ ప్రదానం చేయాలని భావించారు. దీనికోసం శనివారం రాత్రి 10.30 గంటలకు తన పెద్ద కుమారుడు దామెర్ల గణేష్ బాబు, కోడలు పద్మజ, భార్య సుబ్బాయమ్మ, మనుమడు హేమంత్‌తో కలసి లక్ష్మణ్ కారులో బయలుదేరారు. బాపట్ల జిల్లా మార్టూరు సమీపంలోని కోళ్లపూడి జాతీయ రహదారిపై కారుకు అడ్డంగా కుక్క రావడంతో దాన్ని తప్పించబోయి పక్కనే వున్న డివైడర్‌ను కారు ఢీకొనడంతో లక్ష్మణ్, సుబ్బాయమ్మ దంపతులు, వారి మనుమడు హేమంత్ మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన గణేష్‌బాబు, పద్మజ దంపతులకు గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స అందించారు. ప్రమాదంలో కారులో ఎయిర్ బెలూన్లు తెరుచుకున్నప్పటికీ ముగ్గురు ప్రాణాలను కోల్పోయారు. ఈ ప్రమాదం విషయం తెలియగానే మృతుల బంధువులు చీరాల, వేటపాలెం, వినుకొండ నుంచి ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. గాయపడిన వారికి గుంటూరులో చికిత్స అందించగా, సాయంత్రానికి వీరు తిరుపతికి చేరుకున్నారు. ముగ్గురి మృతదేహాలకు మార్టూరు ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. ఆదివారం రాత్రికి మృతదేహాలు ఇంటికి చేరడంతో ఒక్కసారిగా రోదనలు మిన్నంటాయి.

ఆవిరైన ఆనందం : హేమంత్ (25) కొంత కాలంగా ఓ విద్యా సంస్థలో లెక్చరర్‌గా పనిచేసే వారు. ఇటీవల కూటమి ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీలో ఆయన ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. త్వరలో ఉపాధ్యాయ వృత్తిలో జీవితం కొనసాగించాల్సిన హేమంత్ ఈ ప్రమాదంలో అసువులు బాశారు. దీంతో టీచరు ఉద్యోగం వచ్చిన ఆనందం ఆ కుటుంబంలో ఆవిరైంది.



హేమంత్ (ఫైల్ ఫొటో)

బాధాకరం

'హేమంత్‌కు ఈ మధ్య టీచర్ జాబ్ వచ్చి అపాయింట్‌మెంట్ లెటర్ కూడా తీసుకున్నాడు. ఒకటో తేది ఉద్యోగంలో జాయిన్ అవ్వాల్సిన టైమ్‌లో చనిపోవడం చాలా బాధాకరం'అని కొరమేనుగుంటకు చెందిన జనార్దన్ పేర్కొన్నారు.'మేము బయటకు వెళుతున్నాం.ఆదివారం ఉదయం ఇంటికి పాలు అవసరంలేదు' అని ఫోను చేసి హేమంత్ చెప్పారని బత్తెమ్మ గుర్తుచేసుకున్నారు. అదే ఆఖరి మాట అవుతుందనుకోలేదన్నారు.

24న తిరుమలకు సీఎం రాక

ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో తిరుపతికి

మూడుచోట్ల హెలిప్యాడ్‌లు పరిశీలన

వర్షం వస్తే ప్రత్యామ్నాయం వైపు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు కుటుంబ సమేతంగా తిరుమలకు చేరుకుని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. అమరావతి నుంచి బుధవారం సాయంత్రం హెలికాప్టర్‌లో బయలుదేరి తిరుపతి 4.45గంటలకు చేరుకోనున్నారు. నుంచి నేరుగా హెలిక్యాప్టర్‌లో బయలుదేరి తిరుపతికి చేరుకుని అక్కడి నుంచి రోడ్డు మార్గాన తిరుమలకు వెళ్లనున్నారు. ధ్వజారోహణ అనంతరం స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. రాత్రికి జరిగే స్వామివారి పెద్ద శేష వాహనసేవలో పాల్గొంటారు. గురువారం ఉదయం పీఏసీ-5 భవనాన్ని ప్రారంభిస్తారు. 10.45గంటలకు తిరుపతి నుంచి తిరిగి సీఎం చంద్రబాబు అమరావతికి బయలుదేరి వెళ్లనున్నారు. చంద్రబాబు పర్యటన నేపథ్యంలో అలిపిరిసమీపంలో దేవలోక్, భారతీ విద్యాభవన్ పాఠశాల మైదానం, ఎస్వీ అగ్రికల్చర్ కళాశాల మైదానాన్ని హెలిప్యాడ్ కోసం అధికారులు పరిశీలించారు. ఒకవేళ వర్షమొస్తే గన్నవరం నుంచి రేణిగుంట విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో సీఎం చంద్రబాబు చేరుకుని.. అక్కడ్నుంచి రోడ్డు మార్గాన తిరుమలకు వెళ్లే ఏర్పాట్లు పరిశీలిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారంరాత్రి ఆంధ్రజ్యోతికి తెలిపారు.

కపిలతీర్థం.. కిక్కిరిసిన భక్తజనం

- పిండ ప్రదానం చేయడానికి తరలి వచ్చిన జనం
- స్వల్ప తోపులాట, భారీ బందోబస్తు



పిండ ప్రదానాలు చేయించడానికి తరలివచ్చిన జనం



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మహాలయ అమావాస్య.. ఆదివారం.. ఇలా చాలా ఏళ్లకు ఒకసారి వచ్చే దినం. దీంతో తిరుపతిలోని కపిలతీర్థంలో తమ పూర్వీకులు, పెద్దలకు పిండ ప్రదానం చేయడానికి తరలివచ్చారు. ముందస్తుగా పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. అయితే ఊహించని విధంగా వేలాది మంది ఒక్కసారిగా రావడంతో పోలీసులకు సైతం భక్తులను నియంత్రించడం కష్టంగా మారింది. దీంతో ఆలయం ప్రధాన ద్వారం వద్ద నంది సర్కిల్ నుంచి ఆలయంలోకి వెళ్లే రోడ్డుపై కొంత తోపులాట చోటు చేసుకుంది. ఈ విషయం తెలిసిన వెంటనే ఎస్పీ సుబ్బరాయుడు అక్కడకు చేరుకుని పరిస్థితిని నియంత్రించారు. ఏమాత్రం కాస్త అజాగ్రత్తగా ఉన్నా పెద్ద ప్రమాదమే జరిగి ఉండేది. కాగా, తోపులాటను కాస్త తొక్కిసలాటగా మీడియాలో ప్రచారం కావడంతో అప్రమత్తమైన పోలీసులు భారీ సంఖ్యలో ఎస్టీఎఫ్ పార్టీలను అక్కడకు మోహరించారు. బ్యారికేడ్లు ఏర్పాటు చేసి క్యూ పద్ధతిలో లోనికి అనుమతించడంతో రద్దీ తగ్గింది. కాగా, కపిలతీర్థం వద్ద 200 మందిపైగా పురోహితులు పిండ ప్రదాన కార్యక్రమాలు నిర్వహించారు.

భక్తుల భద్రతకు కట్టుదిట్టమైన పర్యవేక్షణ

కపిలతీర్థం వద్ద ఎలాంటి తొక్కిసలాట జరగలేదని ఎస్పీ సుబ్బరాయుడు చెప్పారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 'ఆలయ పరిసరాల్లో భక్తుల రద్దీ నియంత్రణకు అదనపు బందోబస్తు ఏర్పాటు చేశాం. వాహనాల పార్కింగ్ స్థలం పరిమితంగా ఉండటంతో ప్రత్యామ్నాయ చర్యలు తీసుకున్నాం. ఆలయ పరిసరాల్లో డ్రోన్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. కొన్ని సోషల్ మీడియాల్లో తొక్కిసలాట జరిగినట్లు ప్రసారమైన వార్తలు పూర్తిగా అవాస్తవం. నిజమైన సమాచారం కోసం పోలీసు శాఖ అధికారిక ప్రకటనలను మాత్రమే నమ్మాలి' అని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. కాగా, ఓంకార్ అనే వ్యక్తి ఉద్దేశపూర్వకంగా తప్పుడు వార్తలు, ఫొటోలు, వీడియోలను సామాజిక మాధ్యమాల్లో ప్రసారం చేశారని అలిపిరి సీఐ పేర్కొన్నారు. ఇలా భక్తుల్లో భయాందోళన సృష్టించిన ఆయనపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.



కపిలతీర్థం వద్ద భక్తుల భద్రతను పర్యవేక్షిస్తున్న ఎస్పీ



జెండా ఉత్సవాల వద్ద జనసందోహం





ఆంజనేయస్వామి జెండా

ఘనంగా జెండా ఉత్సవం

గూడూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గూడూరులో ఆంజనేయస్వామి జెండా ఉత్సవాలు ఆదివారం రాత్రి శోభాయమానంగా జరిగాయి. ఎటుచూసినా జనసంద్రంగా మారింది. విద్యుద్దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి. వివిధ కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన అంజనీపుత్రుడి జెండాలను ట్రాక్టర్లపై ఉంచి పట్టణంలో ఊరేగించారు. వాడవాడలా జరిగిన ఈ ఊరేగింపు ముందు బ్యాండు మేళాలు, తప్పెట్లు, జింగిరి మేళం, కోలాటాలు, భేతాళ, కాంతార నృత్యాలు, మంగళవాయిద్యాలు, కేరళ బ్యాండు విన్యాసాలు, యువత చిందులతో సందడి చేశారు. తొలుత బజారువీధిలోని కలిశంకొట్టుపై గ్రామజెండా ప్రతిష్ఠాపన తొలుత సంప్రదాయ బద్ధంగా నిర్వహించారు. ముందుగా కలిశంకొట్టు వద్ద ఆంజనేయస్వామి జెండాకు పూజలు నిర్వహించి... ఈ జెండాను పట్టణ పొలిమేర్లలో తిప్పి తిరిగి తీసుకొచ్చి కలిశం కొట్టు వద్ద ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు జరపడంతో జెండా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఆంజనేయ స్వామి జెండాలకు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రికి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లపై ఉంచి గ్రామోత్సవం జరిపారు. పట్టణంలో వివిధ అమ్మవారి ఆలయాల్లో సోమవారం కలశ స్థాపనతో శరన్నవ రాత్రులను ప్రారంభించనున్నారు.

వెరీగుడ్.. కీపిటప్

- కలెక్టర్‌కు, యంత్రాంగానికి సీఎం అభినందనలు



స్కోచ్ అవార్డు పోస్టర్ ముందు కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్వర్ణనారావారిపల్లె ప్రాజెక్టుకు ప్రతిష్టాత్మక స్కోచ్ సంస్థ నుంచి గోల్డెన్ అవార్డును అందుకున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ప్రాజెక్టులో పాలుపంచుకున్న అధికారులను సీఎం చంద్రబాబు నాయుడు ఆదివారం ఎక్స్ వేదికగా అభినందించారు. కేవలం 45రోజుల వ్యవధిలోనే మొత్తం 1,600 ఇళ్లకు సోలార్ రూఫ్ టాప్‌ను ఏర్పాటు చేసిన విద్యుత్ వెలుగులను నింపారు. కర్బన ఉద్గారాల తగ్గింపులో భాగంగా హరిత స్వర్ణాంధ్ర లక్ష్యంగా ప్రారంభించిన ఈ ప్రాజెక్టులో ఉచితంగా ప్రతి ఇంటికి సోలార్ రూఫ్ టాప్‌నుఏర్పాటు చేశారు. మొత్తం 3,396 కిలోవాట్ల సామర్థ్యంతో ఏడాదికి 4.89 మిలియన్ల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి కానుంది. రూ.3.39కోట్ల విద్యుత్ సోలార్ రూఫ్ టాప్ ద్వారా ఉత్పత్తి కానుంది. ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజనలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా స్వర్ణ నారావారిపల్లె ప్రాజెక్టు ద్వారా సౌరశక్తి ప్యానెళ్లను ప్రతి ఇంటిపై ఉచితంగా ఏర్పాటు చేశాయి. అన్ని ఇళ్లకూ సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసి మొత్తం గ్రీన్ ఎనర్జీని వినియోగిస్తున్న తొలి గ్రామంగా ప్రతిష్టాత్మక స్కోచ్ సంస్థ గోల్డెన్ అవార్డును ప్రకటించింది. తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఈ అవార్డును ఢిల్లీలో అందుకున్నారు. దీనిపై సీఎం చంద్రబాబునాయుడు ఎక్స్ వేదికగా గ్రామస్తులకూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ లక్ష్యాన్ని చేరుకోవటంలో సహకరించిన ప్రజలు, అధికారులకు అభినందనలు తెలిపారు.

పోలీసు పీజీఆర్ఎస్ రద్దు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే పోలీసు పీజీఆర్ఎస్ వివిధ కారణాల రీత్యా రద్దు చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంతో పాటు తిరుపతికి ప్రముఖుల తాకిడి ఎక్కువగా ఉన్నందున రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు. అత్యవసర పరిస్థితుల్లో సమీప పోలీసు స్టేషన్లకు వెళ్ళి పిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- స్విగ్గి డెలివరీ బాయ్ మృతి



మునిరెడ్డి (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో స్విగ్గి డెలివరీ బాయ్‌గా పని చేసే మునిరెడ్డి మృతి చెందారు. శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీ వద్ద తిరుపతి రహదారిపై ఆదివారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. పట్టణంలోని కొండమిట్టకు చెందిన మునిరెడ్డి స్విగ్గి యాప్ ద్వారా ఆహార పదార్థాలను డోర్ డెలివరీ చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో శ్రీరామ్ నగర్ కాలనీ సమీపంలో ఓ హోటల్లో నగదు జమ చేసేందుకు వెళ్తుండగా శ్రీకాళహస్తి నుంచి తిరుపతి వైపుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఇతడి ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ముని రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు హుటాహుటిన చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. శ్రీకాళహస్తి ఒకటో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదంపై ఆరా తీశారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ప్రమాద స్థలం

ఆదాయం కోసం వెంపర్లాట

- బదిలీ అయినా డిప్యుటేషన్ కోసం పైరవీలు
- పంచాయతీ కార్యదర్శుల తీరుపై విమర్శలు

తిరుపతి(కలెక్టరేట్),సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల ప్రగతికి అవరోధంగా ఉన్న విధానాలను పక్కనబెట్టి పునర్వ్యవస్థీకరణకు ప్రభుత్వం నూతన సంస్కరణలు తీసుకొచ్చింది.జనాభా, ఆదాయం ఆధారంగా చేసుకుని పంచాయతీలను గ్రేడ్‌లుగా విభజించింది. జిల్లాలో 774 గ్రామ పంచాయతీలు ఉండగా అందులో మేజర్ పంచాయతీలు సుమారు 30 ఉన్నాయి.ప్రతి పంచాయతీకి గ్రేడ్‌ల వారీగా కార్యదర్శులు ఉండే విధంగా చర్యలు తీసుకుంది. మేజర్ పంచాయతీలకు సీనియారిటీ ప్రాతిపాదికన పంచాయతీ కార్యదర్శులను నియమించింది. అయితే ఆదాయం ఎక్కువగా ఉండే తిరుపతి, శ్రీకాళహస్తి, రేణిగుంట, గూడూరు పట్టణాలకు సమీపంలో ఉన్న పంచాయతీల్లో పోస్టింగ్‌లపై పలువురు కార్యదర్శులు దృష్టి పెట్టారు. డిప్యుటేషన్ పేరుతో అక్కడికి మకాం మార్చేందుకు రాజకీయ నాయకుల ద్వారా పైరవీలు చేస్తున్నారు. అర్హత లేకున్నా వారం రోజులుగా కలెక్టరేట్ చుట్టు చక్కర్లు కొడుతున్నారు. పదేపదే అధికారులపై ఒత్తిడి తెస్తుండటంతో వారు తలలు పట్టుకుంటున్నారు. గతంలో తిరుచానూరు, కరకంబాడి, రేణిగుంట, చంద్రగిరి, శ్రీకాళహస్తి,సత్యవేడు, గూడూరు నియోజకవర్గాల్లో బిల్లు కలెక్టర్లతో కలిసి కోట్లాది రూపాయలు స్వాహా చేయడం, వారి నుంచి ప్రభుత్వం రికవరీ చేయడం తెలిసిందే.అలాంటి వారే మళ్లీ డిప్యూటేషన్లు కోరుతున్నారన్న విమర్శలున్నాయి.

చంద్రగిరి

కనీస వేతనం అమలు చేయాలి

పాకాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు మధుసూదన్‌రావు కోరారు. ఆదివారం ఆర్టీసీ బస్టాండు సమీపంలో జరిగిన సీఐటీయూ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిగంటలు పెంచి కార్మికుల సంక్షేమం విస్మరించాయన్నారు. ఎనిమిది పని గంటలు ఉంచాలని, కనీస వేతనం రూ.26వేలు చేయాలని కోరారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలు సక్రమంగా అమలు చేయాలన్నారు. ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన కార్మికులు, సంఘమిత్రలకు బకాయిలు వెంటనే విడుదల చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీఐటీయు నాయకుడు కేశవ ఆచారి, మురళి, ఆనంద్, శేఖర్, నరేంద్ర, వెంకటరమణ మోహన్‌బాబు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):తిరుపతి జిల్లా కలెక్టరేట్ వేదికగా నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఇచ్చిన అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించి సమాచారంతెలుసుకోవడానికి 1100కు కాల్‌చేయవచ్చన్నారు. ఇక అర్జీదారులు తమ అర్జీలను మీకోసం.ఏపీ.జీవోవి.ఐఎన్‌లో నమోదు చేసుకోవచ్చన్నారు. సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరుగుతుందన్నారు. జిల్లా ప్రజలు పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శాస్త్రోక్తంగా మహాప్రత్యంగిర హోమం

రామచంద్రాపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మహాలయ అమావాస్య సందర్భంగా శ్రీశక్తిపీఠంలో ఆదివారం మహా ప్రత్యంగిర హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. మరకతశక్తి కాళీ అమ్మవారికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. దసరా నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో గ్రామదేవత అయిన ముత్యాలమ్మ జాతర నిర్వహించారు. అమ్మవారికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేశారు. 108 గుమ్మడికాయలు, 108 టెంకాయలను సమర్పించారు. సాయంత్రం కాళీ అమ్మవారి ఊంజల్‌సేవ వైభవంగా జరిగింది. అమ్మవారికి శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి, కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి మంగళహారతులు ఇచ్చారు. కార్యదర్శి శ్రీకాంత్, మేనేజరు ప్రసాద్ పాల్గొన్నారు.

సీమ సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషిచేయాలి

కుంచం వెంకటసుబ్బారెడ్డి

బెంగళూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల నేతలు వెనుకబడిన ప్రాంతాల శాశ్వత అభివృద్ధికోసం పాటుపడాలని రాయలసీమ రాష్ట్ర సమితి వ్యవస్థాపకుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. బెంగళూరులో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం 88 ఏళ్ల క్రితం శ్రీబాగ్ ఒప్పందం జరిగిందని, కానీ అమలుకు నోచుకోకపోవడమే రాయలసీమ వెనుకబాటుకు కారణమన్నారు. దేశంలోనే రాయలసీమ వెనుకబడిన ప్రాంతమని, సమగ్ర అభివృద్ధి చెందాలంటే ప్రత్యేక రాష్ట్రంగానీ, గతంలోని జరిగిన ఒప్పందాల అమలు మాత్రమే పరిష్కారమని స్పష్టం చేశారు. నవంబరు 16లోగా శాశ్వత పరిష్కారానికి రాయలసీమ నాయకులు సిద్ధం కావాలన్నారు. కృష్ణ, తుంగభద్ర, పెన్నా నదుల నీటి వినియోగంలో రాయలసీమకు ప్రాధాన్యత ఇవ్వాలని, రాయలసీమ, కోస్తా జిల్లాలకు సమానంగా శాసనసభ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

రేపు ఆగమోక్తంగా అంకురార్పణ


వాహనాలను శుద్ధి చేస్తున్న ఆలయ సిబ్బంది, వేద విద్యార్థులు

తిరుపతిరూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట గ్రామంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలంకార మండపం, వాహనాలను ఆలయ సిబ్బందితో వేదపాఠశాల విద్యార్థులు కలసి ఆదివారం శుద్ధి చేశారు. పరిసరాలను శుభ్రం చేశారు. ప్రధాన ఆలయంతోపాటు యాగశాల, అలంకారమండపం, కళ్యాణ మండపాలను అలంకరణ చేశారు. గ్రామ వీధులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రత్యేకంగా బారికేడ్లు, చలువపందిళ్లు వేయించారు. మంగళవారం సాయంత్రం 5-8 గంటల వరకు వైఖాన ఆగమోక్తంగా అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక కమిటీ సభ్యులు చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్కొన్నారు.

గొడుగుల ఊరేగింపులో కానుకలు ఇవ్వకండి

● భక్తులకు టీటీడీ సూచన

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడసేవనాడు అలంకరించేందుకు చెన్నై నుంచి తిరుమలకు చేరుకునే గొడుగుల ఊరేగింపులో భక్తులు ఎలాంటి కానుకలు ఇవ్వద్దని టీటీడీ కోరింది. భక్తులు అందించే ఈ కానుకలు టీటీడీకి చేరవని స్పష్టం చేసింది. బ్రహ్మోత్సవాల సమయంలో హిందూ సంస్థలు చెన్నై నుంచి గొడుగులను ఊరేగింపుగా తిరుమలకు తీసుకువచ్చి స్వామికి సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని, ఈ గొడుగులు 27వ తేదీన తిరుమలకు చేరుకుంటాయని టీటీడీ పేర్కొంది.

పరకామణి చోరీపై

ఎందుకు విచారణ జరిపించలేదు?


మాట్లాడుతున్న నరసింహయాదవ్ తదితరులు

తిరుపతి, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): మీ హయాంలో తప్పు జరిగినప్పుడు ఎందుకు విచారణ జరిపించలేదని యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్ ప్రశ్నించారు. ఆదివారం ఆయన టీడీపీ నేతలతో కలిసి తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. పరకామణిలో ఒక మఠం తరపున పనిచేస్తున్న రవికుమార్‌తో చేతులు కలిపి ఎన్ని కోట్లు నొక్కేశారనేది బయట పెడతామన్నారు. లక్షల కోట్లు కాజేసి బినామీ పేర్లకు బదిలీ చేసి కల్లబొల్లి కబుర్లు చెప్పడం మానుకోవాలని సూచించారు. రవికుమార్‌తో చేసుకున్న మధ్యవర్తిత్వంతో కొన్ని ఆస్తులను తీసుకుని మరికొన్నింటిని మీ బినామీల మీదకు మార్చారంటూ శాప్ ఛైర్మన్ రవినాయుడు ఆరోపించారు. చంద్రగిరిలోని డోర్నకంబాల దగ్గర 8 ఎకరాలను ఎవరి పేరుమీదకు మార్చారో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి చెప్పాలన్నారు. మర్డర్లు, మానభంగాలు చేసినవారందరూ పశ్చాత్తాపపడితే వదిలేయమని మీ వైసీపీ చట్టాల్లో ఉందా అని ప్రశ్నించారు. 'టీటీడీ అంటే నీ జెరాక్స్ సెంటర్ అనుకుంటున్నావా? దోచుకున్న వారితో సెటిల్మెంట్లు చేయడమేంటి? నీ ఆస్తులన్నీ టీటీడీలో దొంగిలించినవే. ఆ దేవుడు విడిచిపెట్టడు' అని డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ వ్యాఖ్యానించారు. పరకామణి కుంభకోణంలో దొంగలను లోక్ అదాలత్ ద్వారా విడిచిపెట్టడం టీటీడీ చరిత్రలో ఒక బ్లాక్ డేగా మిగిలిపోతుందని ఏపీయూఎఫ్ఐడీసీ డైరెక్టర్ ఊకా విజయకుమార్ పేర్కొన్నారు. ఈ సంఘటనలో వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ధర్మారెడ్డి, కరుణాకర్ రెడ్డి, అప్పటి తిరుమల సీఐ జగన్‌మోహన్‌రెడ్డి హస్తం ఉందన్నారు. రవికుమార్‌కు చెందిన రూ.15 కోట్ల ఆస్తులు.. అతడికి సన్నిహితుడైన చంద్రగిరిలోని జయచంద్రారెడ్డి పేరు మీద ఉన్నాయని, అతడే మధ్యవర్తిత్వంలో ఉన్నాడని పేర్కొన్నారు. దేవుడిని అడ్డం పెట్టుకుని అసత్యప్రచారాలు చేస్తే ఊరుకోబోమని నాయిబ్రాహ్మణ ఛైర్మన్ రుద్రకోటి హెచ్చరించారు. ఈ సమావేశంలో తాతయ్యగుంట గంగమ్మ దేవస్థానం ఛైర్మన్ నైనారు మహేష్ యాదవ్, రజక కార్పొరేషన్ డైరెక్టర్ కరాటే చంద్ర పాల్గొన్నారు.

నేటి నుంచి వేడుకగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు


శక్తిచాముండేశ్వరిదేవి

తిరుపతి రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట ఎల్ఎస్‌నగర్‌లోని శక్తిచాముండేశ్వరి దేవీ, చెంచువారికాలనీలోని మూలస్థాన యల్లమ్మ ఆలయాల్లో సోమవారం నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. అమ్మవారి ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించి ముస్తాబు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ హోమం, కుంకుమార్చన, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్తలు బిరుదాల భాస్కర్‌రెడ్డి, బిరుదాల సిద్ధారెడ్డి పేర్కొన్నారు. గ్రామస్తులతోపాటు సమీప ప్రాంతాల్లోని భక్తులు అమ్మవారిని దర్శించుకుని అనుగ్రహం పొందాలని కోరారు. కాగా చెంచువారికాలనీలోని యల్లమ్మ ఆలయంలో అభిషేకం, అలంకారం, పూజ, అన్నదాన కార్యక్రమాల్లో ఉభయదాతలుగా పాల్గొనదలచిన భక్తులు రూ.10,116 చెల్లించి రశీదు పొందాలని ధర్మకర్త సిద్ధారెడ్డి పేర్కొన్నారు.

ముత్యాలమ్మ కుంభాభిషేకానికి ఏర్పాట్లు


ఆలయం ముందు ఏర్పాటు చేస్తున్న చలువ పందిళ్లు

తిరుపతిరూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం మల్లంగుంట గ్రామంలో వెలసిన ముత్యాలమ్మ, మూలస్థాన ఎల్లమ్మ, గంగమ్మతల్లి ఆలయాలు కుంభాభిషేక మహోత్సవానికి సిద్ధమవుతున్నాయి. ఈనెల 25 నుంచి ఐదురోజుల పాటు నిర్వహించే ఈ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణాన్ని అందమైన రంగవల్లులు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. చలువపందిళ్లు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఉత్సవానికి గ్రామస్తులు, పరిసర ప్రాంత ప్రజలు హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు పార్లపల్లి మునికృష్ణారెడ్డి కోరారు.

శ్రీచైతన్యలో ముందస్తు దసరా వేడుకలు


అమ్మవారికి పూజ చేస్తున్న టీచర్లు, విద్యార్థులు

తిరుపతిరూరల్, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం పేరూరు పంచాయతీ తారకరామనగర్‌లోని శ్రీచైతన్య స్కూల్‌లో ముందస్తు దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. విద్యార్థుల బొమ్మలకొలువు, దుర్గాదేవి వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఏజీఎం సురేష్ మాట్లాడుతూ పండుగలు విజయాలకు ప్రతీకలని తెలిపారు. ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్న, డీన్, కోఆర్డినేటర్, ఇన్‌చార్జులు, టీచర్లు పాల్గొన్నారు.

చివరిమజిలీ కష్టాలు తీరేదెన్నటికో..?

శ్మశానానికి దారిలేక అగచాట్లు




బురదమయంగా మారిన శ్మశానానికి వెళ్లే దారి- రాళ్లు తేలిన దారి - దారి పైకి పెరిగిన చెట్లు

భాకరాపేట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మనుషులు ఎలా బతికినా మరణించాక పూడ్చేందుకు ఆరడుగుల నేల కావాల్సింది. దీనికోసం పలుచోట్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చాలా గ్రామాల్లో శ్మశాన వాటిక లేక అంతిమయాత్రకు పడే అవస్థలు వర్ణనాతీతం. పలుచోట్ల శ్మశాన వాటికలు ఉన్న అక్కడికి వెళ్లే దారి లేక పేదలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లె పంచాయతీ బోడిరెడ్డిగారిపల్లె గ్రామంలో 90 నివాస గృహాలున్నాయి. 300 మంది జనాభా ఉంటున్నారు. ఈ గ్రామ సమీపంలో సర్వే నెం.37లో 2.37 ఎకరాల భూమిని బ్రిటీషు హయాంలో శ్మశానానికి కేటాయిం చారు. అయితే అక్కడికి పోవడానికి దారిలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ సమీపంలో భూములున్న వారి సొంత స్థలాల్లోనే ఖననం చేసుకుంటున్నారు. భూములు లేని పేదలు మరణిస్తే శ్మశానానికి తీసుకెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నారు. వర్షం వస్తే శ్మశానానికి వెళ్లే దారిలో వర్షపు నీరు నిలిచిపోతుంది. అడుగుపెడితే బురదలో కూరుకుపోవాల్సిందే. ఇరువైపులా కంప చెట్లు కమ్ముకున్నాయి. వర్షానికి కోతకు గురై రాళ్లు తేలిపోయి నడవాలంటే అడుగు పెట్టలేని పరిస్థితి. గత ప్రభుత్వంలో స్థానిక నాయకులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండాపోయింది. ప్రస్తుత ఎమ్మెల్యే పులివర్తి నాని అయినా స్పందించి దారి కల్పిస్తారని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే సర్వసభ్య సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి

చంద్రగిరి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికే మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ వర్షాకాలం రానుండటంతో గ్రామాల్లో పారిశుధ్య పనులు ఎప్పటికపుడు చేపట్టాలన్నారు. వరద సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు అన్ని శాఖల అధికారులు తమ ప్రణాళిక నివేదికలను చదివి వినిపించారు. అగరాల సర్పంచ్ భాస్కర్‌రెడ్డి జాతీయ రహదారిలో సర్వీసు రోడ్లలో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, సమీప గ్రామాల్లో స్పీడు బ్రేకర్లు వేయాలని కోరారు. టౌన్ సర్వీసు బస్సులను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ గౌస్‌బాషా, సింగిల్‌విండో ఛైర్మన్ రాజులగారి వినోద్‌కుమార్‌రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీవో శేఖర్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా అగ్నిగుండ ప్రవేశం

రామచంద్రాపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): బీరమాకులకండ్రిగ ద్రౌపదీ సమేత ధర్మరాజ మహాభారత ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రాత్రి అగ్నిగుండ ప్రవేశం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో విశేష పూజల అనంతరం అమ్మవారికి తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. ఉదయం 11గంటలకు ఆలయం ముందు మట్టితో భారీ దుర్యోధనుడి ప్రతిమను తయారు చేసి పూజలు నిర్వహించారు. మహాభారత సంగ్రామంలో అందరినీ పోగొట్టుకున్న దుర్యోధనుడు జలస్థంభన శక్తితో మడుగులో దాక్కుంటాడు. శ్రీకృష్ణుడి సూచనలతో భీముడు దుర్యోధనుడిని బయటకు రప్పించి తొడలపై కొట్టి వధించే ఘట్టాలను వేషధారులు రక్తికట్టించారు. సాయంత్రం ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఉత్సవ మూర్తులను ఊరేగించారు. ఆలయం ముందు అగ్నిగుండం వద్ద అమ్మవారి ఉత్సవమూర్తిని కొలువుదీర్చారు. ఆలయ పూజారి అగ్నిగుండం నుంచి తీసుకువచ్చి అమ్మవారి ఒడిబాలుగా కట్టిన అనంతరం గోవిందనామ స్మరణ మధ్య భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు.


యుద్ధ సన్నివేశంలో భీముడు, దుర్యోధన వేషధారులు

మొబైల్ ఫోన్ వాడకంతో మెదడుకు ప్రమాదం


రెడ్డివారి రాజశేఖర్‌రెడ్డికి వైద్య పరీక్షలు చేస్తున్న వెంగమ్మ

చంద్రగిరి, సెప్టెంబర్ 19(ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్లు అధికంగా వాడితే మెదడుకు ప్రమాదం ఉంటుందని శ్రీదేవరాజ్ యవర్స్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ వెంగమ్మ అన్నారు. ఆదివారం చంద్రగిరి మండలం నరసింగాపురంలో రెడ్డివారి నాదమునిరెడ్డి మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృద్ధులకు ఉచితంగా నిర్వహించిన డెమెన్షియా స్క్రీనింగ్ క్యాంప్(చిత్త వైకల్యం)కు విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ వెంగమ్మ, మాజీ ఎమ్మెల్యే రెడ్డివారి రాజశేఖర్ రెడ్డి వచ్చారు. వెంగమ్మ మాట్లాడుతూ డిజిటల్ ప్రపంచంలో మొబైల్ ఫోన్లు అధికంగా వాడటం వలన నిద్రలేమి సమస్య వస్తోందని, తద్వారా మెదడుకు ప్రమాదం పొంచి ఉందని అన్నారు. రోజుకు కచ్చితంగా 8 గంటలు నిద్రపోవాలన్నారు. జంక్‌ఫుడ్ వల్ల మధుమేహం, హైపర్ టెన్షన్, థైరాయిడ్, గుండె జబ్బులతో మానసికంగా ఒత్తిడికి గురై డెమెన్షియా బారినపడుతున్నారని తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రెడ్డివారి రాజశేఖరరెడ్డి ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు వీరంగారి రమేష్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజేంద్రప్రసాద్(పెదబాబు), ఈశ్వర్‌రెడ్డి, మాధవ రెడ్డి, వెంకటమునిరెడ్డి, సుబ్రమణ్యం, సింగిల్‌విండో డైరెక్టర్ రెడ్డెప్ప, సుదర్శన్‌శెట్టి, ఓంకార్, హెచ్‌ఎం హైమావతి, వైద్యులు పాల్గొన్నారు.

దువాతో ముగిసిన ఇజ్తిమా ప్రార్థనలు



పాకాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇరంగారిపల్లె పంచాయతీ ముద్దలపల్లె సమీపంలో శనివారం ప్రారంభమైన ఇజ్తిమా ప్రార్థనలు ఆదివారం రాత్రి దువా (సామూహిక ప్రార్థన)తో ముగిశాయి. అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి విశేష సంఖ్యలో ముస్లింలు హాజరయ్యారు. తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, రాష్ట్రం నుంచి వచ్చిన మత పెద్దలు మహమ్మద్ ప్రవక్త బోధనలను బోధించారు. ఆదివారం రాత్రి ముస్లింలు మత పెద్దల ఆధ్వర్యంలో సామూహిక ప్రార్థనలు చేశారు.

అభివృద్ధి పనుల్లో నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలి

ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ బాలునాయక్



తిరుపతిరూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్దేశించిన అభివృద్ధి పనుల్లో లక్ష్యాలను సాధించాలని విజయవాడకు చెందిన ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ బాలునాయక్ పేర్కొన్నారు. తిరుపతిరూరల్‌మండల ఎంపీడీవో కార్యాలయ సమావేశమందిరంలో ఆదివారం తిరుపతి, చిత్తూరు, కడప, నెల్లూరు, అన్నమయ్య జిల్లాలకి చెందిన పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం అధికారులతో రీజనల్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐదుజిల్లాలకు సంబంధించి పల్లెపండుగ-2లో పీఎంజీఎస్‌వై, నాబార్డు, పీఆర్ నుంచి దాదాపు రూ215 కోట్ల పనులు మంజూరైనట్లు తెలిపారు. ఈఅభివృద్ధిపనుల్లో లక్ష్యాలను చేరుకోకపోతే సంబంధింత పీఆర్ ఇంజినీర్లకు ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. ఇటీవల సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, సిమెంట్‌రోడ్డు పనుల పురోగతిపై పంచాయతీరాజ్‌శాఖామంత్రి పవన్ కళ్యాణ్ సమీక్ష నిర్వహించారని వివరించారు. ఈపనులకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు మంజూరు చేస్తున్నాయని, నిర్దేశించిన సమయంలో పనులు చేయకపోతే కేంద్ర పభుత్వ నిధులు తిరిగి వెనక్కి చెల్లించాల్సి ఉంటుదన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై భారం వేసి కూర్చుంటే కుదరదని, డీఈఈలు ప్రత్యక్షంగా సందర్శించి పనులను పర్యవేక్షించాలని సూచించారు. లేనిపక్షంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఐదుజిల్లాలకు సంబంధించిన పనుల పురోగతిపై నియోజకవర్గాల వారీగా ఈఈ, డీఈఈలతో చర్చించారు. చిత్తూరు ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీపీఆర్‌ఈవో మధుసూదన్, ఎస్‌ఈలు, ఈఈలు, డిప్యూటీఈఈలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



తిరుచానూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం కళాకారులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చెన్నైకి చెందిన ఆహం డివైన్ ఫౌండేషన్ విద్యార్థినులు శాస్త్రీయ నృత్య ప్రదర్శన చేశారు. ఐశ్వర్య, దీక్ష, నిఖిత, పవిత్ర, భావతారిణి, సాయి నందిని, మాళవిక, కారుణ్య, సుభిష, లలితశ్రీ తదితర కళాకారులు నృత్య ప్రద్శన చేశారు. ఏవో సుధాకర్ వారిని సత్కరించారు.

మూలస్థాన ఎల్లమ్మ ఉత్సవాలకు సర్వం సిద్ధం


ఉత్సవాలకు ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ



చంద్రగిరి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. సోమవారం నుంచి అక్టోబరు 2వ తేది వరకు దేవీ నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని జాతీయ రహదారి నుంచి కొత్తపేట వరకు విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఆలయంలో మామిడి తోరణాలు, అరటి బోదెలతో విశేషంగా అలంకరించారు. అధిక సంఖ్యలో మహిళలు అమ్మవారి మాలలు ధరించి దీక్షలో ఉంటారు. వేకువజామున వారు ఆలయం వద్ద స్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకోవడానికి వీలుగా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఉత్సవాలు సోమవారం ఉదయం 9.10 నుంచి 9.56 గంటల మధ్య తులాలగ్నంలో కలశ స్థాపనతో ప్రారంభం కానున్నాయి. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ పాలకమండలి సభ్యులు, అధికారులు కోరారు.

అందరి సహకారంతో ఉత్సవాలు



ప్రజాప్రతినిధులు, అధికారులతో సహకారంతో రాజకీయాలు, కులమతాల కతీతంగా ఉత్సవాలు నిర్వహిస్తాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం.
- చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ చైర్మన్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



1983-84 బ్యాచ్ టీపీఎం స్కూల్ విద్యార్థులు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక టీపీఎం పాఠశాల పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమావేశం ఉల్లాసంగా సాగింది. 1983-84 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు పాఠశాల వేదికగా ఆదివారం కలిశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. పాత స్మృతులను నెమరు వేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గుర్తు చేసుకుని, వారికి కృతజ్ఞతలు తెలిపారు. మరణించిన గురువులను, స్నేహితులను గుర్తుచేసుకుని రెండు నిమిషాలు మౌనం పాటించారు. పాఠశాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తూ వచ్చామని, భవిష్యత్తులోనూ కొనసాగించాలని తీర్మానించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



విజయభారతి సాయని, రఘు

తిరుమల, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ సభ్యురాలు విజయభారతి సాయని, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, సినీ నటుడు రఘు ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

మెగా కార్పొరేట్ క్రికెట్ టోర్నీ విజేత ఎన్‌ఎస్‌యూ



ట్రోఫీ అందుకుంటున్న ఎన్‌ఎస్‌యూ జట్టు

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మెగా కార్పొరేట్ క్రికెట్ టోర్నీలో జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం జట్టు విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన తుది పోరులో తొలుత అమరరాజ జట్టు నిర్ణీత 20 ఓవర్లకు 129పరుగులు మాత్రమే చేసింది. అనంతరం బరిలోకి దిగిన ఎన్‌ఎస్‌యూ జట్టు 5 ఓవర్లు మిగిలి ఉండగానే లక్ష్యం ఛేదించింది. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ జీ.ఎస్.ఆర్.కృష్ణమూర్తి, ఎస్వీయూ వీసీ అప్పారావు, మాజీ ఎమ్మెల్యే మోహన్ క్రీడాకారులను అభినందించి, బహుమతులు, ట్రోఫీ అందజేశారు.

నాగోతు రమేష్‌నాయుడికి సన్మానం



రమేష్‌నాయుడిని సన్మానిస్తున్న బీజేపీ నేతలు

తిరుపతి(ఉపాధ్యాయనగర్), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడిని బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఆయన పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి ఆదివారం తిరుపతిలోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయానికి వచ్చారు. స్థానిక నాయకులు ఆయన్ను సన్మానించి, అభినందనలు తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, మాజీ అధ్యక్షుడు చంద్రప్ప, ఉపాధ్యక్షురాలు అనూష, ఇతర నాయులు పొన్నగంటి భాస్కర్, ప్రశాంతిరాజు, గుండాల గోపీనాథ్‌రెడ్డి, గంగమ్మ గుడి పాలకమండలి సభ్యులు తమ్మిశెట్టి చంద్రశేఖర్‌రాయల్, జిల్లా ప్రధాన కార్యదర్శులు బాలాజీ, నరేష్, ఐటీ సెల్ కన్వీనర్ రెడ్డిబాబు పాల్గొన్నారు.

ఘనంగా గురజాడ జయంతి



గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సదాశివం

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండరామాలయ దక్షిణమాడవీధిలోని చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో ఆదివారం మహాకవి గురజాడ అప్పారావు 163వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం, టీడీపీ బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర సభ్యులు హనుమంతరావు, రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపినాథ్‌రెడ్డి, జయలక్ష్మి, పీఆర్ఎల్‌కుమార్, మల్లికార్జున్, చంద్రమోహన్, సుబ్రహ్మణ్యం, చంద్ర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలను వివాదాస్పద కేంద్రంగా మార్చవద్దు: బీజేపీ

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): పవిత్రమైన తిరుమల క్షేత్రాన్ని వివాదాస్పద కేంద్రంగా మార్చవద్దని బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. తిరుమల శ్రీవారిని ఆదివారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. గత కొద్దిరోజులుగా తిరుమలను ఓ ప్రచార కేంద్రంగా, వివాదాస్పద స్థలంగా మార్చి రాజకీయ అవసరాల కోసం వాడుకుంటున్నారని, ఇది క్షమించరాని విషయమన్నారు. స్వార్థప్రయోజనాల కోసం తిరుమలలో ఏ చిన్న ఘటన జరిగినా రాజకీయంగా మలచి పెద్ద ఎత్తున ప్రచారం చేయడం దురదృష్టకరమన్నారు. ప్రపంచం మొత్తాన్ని తిరుమలను ఆదర్శంగా తీసుకుంటుంటే ఏపీలోని కొంతమంది రాజకీయనేతలకు మాత్రం తిరుమలలో అన్నీ తప్పులే కనిపిస్తున్నాయన్నారు. ప్రతిదాన్ని రాజకీయ కోణంలోనే చూస్తున్నారని ఆగ్రహించారు. ఇప్పటికైనా దీనికి ముగింపు పలకాలన్నారు. ఇతర మతాలకు సంబంధించిన చర్చిలు, మసీదుల్లో కూడా అనేక వివాదాలున్నాయని, అయినప్పటికీ వారు రహస్యంగానే చర్చించుకుంటున్నారన్నారు. కానీ హిందువులు మాత్రం ఆలయాల విషయంలో మీడియా ముందుకు వచ్చి ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. తప్పులు జరిగితే అధికారుల దృష్టికి తీసుకువచ్చి సరిచేయాలన్నారు. ధర్మపరిరక్షణ చేయకుండా భక్తుల మనోభావాలను దెబ్బతీస్తూ నష్టం చేస్తున్నారని మండిపడ్డారు. కలియుగ దైవంపై ఇలానే విమర్శలు చేస్తూ ఏ ఒక్కరు బాగుపడేది లేదన్నారు.

తిరుపతి

సామాజిక న్యాయం కనబడటం లేదు

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో సామాజిక న్యాయం కనపడటం లేదని ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఉప్పర నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం చేపట్టిన ఆలయాల ఛైర్మన్ల నియామకాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీల జాడే లేదన్నారు. టీడీపీకి బీసీలే ఊపిరి అని పదేపదే చెప్పుకునే ఆ పార్టీ నాయకులు అమలు చేయడంలో వెనుకబడ్డారని ఎద్దేవా చేశారు. తాను బీసీని కాబట్టే టీడీపీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఇచ్చారని చెబుతున్న పల్లా శ్రీనివాస్ బీసీలకు అన్యాయం జరిగితే మౌనంగా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. బీసీలకు అన్యాయం చేసే పార్టీలకు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుతామన్నారు.

సీబీఎస్‌లో 21 దుకాణాలకు షోకాజ్ నోటీసులు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బస్టాండులోని 21 దుకాణాలకు ఆర్టీసీ ఉన్నతాధికారులు ఆదివారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. దుకాణాల తీరుపై ప్రయాణికుల నుంచి ఫిర్యాదులు వస్తుండటంతో ప్రజారవాణాధికారి జగదీష్ దృష్టి సారించారు. నివేదిక ఇవ్వాలని సంబంధిత విభాగాన్ని ఆదేశించారు. నెల రోజులుగా ఇదే పనిలో ఉన్న ఒక బృందం పూర్తి వివరాలతో డీపీటీవోకు నివేదిక సమర్పించింది. 3 దుకాణాలు ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తున్నట్లు, 19 నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నట్లు ఆ నివేదికలో పేర్కొన్నారు. ఇందులో 9, 11, 12, 14, 41, 43, 53, 54, 57, 60, 62, 65, 66, 78, 83, 84, 87, 88, 99, 113, 118 దుకాణాలు ఉన్నాయి. వీటితోపాటు బెంగళూరు ప్లాట్‌ఫామ్ వద్ద ఉన్న టాయిలెట్ నిర్వహణ పూర్తిగా బాగలేదని గుర్తించి నోటీసులు జారీ చేశారు.

నేడు చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయండి

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం చేపట్టనున్న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని జేఏసీ సర్కిల్ కన్వీనర్ జి.ఏలుమలై ఒక ప్రకటనలో కోరారు. దశలవారీ ఆందోళనలో భాగంగా సోమవారం ర్యాలీ, కలెక్టర్‌కు వినతిపత్రం తదితర కార్యక్రమాలు ఉంటాయని, పోలీసుల అనుమతి లేని కారణంగా ఉద్యోగులు వ్యక్తిగతంగా కలెక్టర్ కార్యాలయానికి ఉదయం 10 గంటలకు చేరుకోవాలని కోరారు.

గరుడ వారధిపై పుట్టిన రోజు వేడుకలు
యువతకు పోలీసుల కౌన్సెలింగ్



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గరుడ వారధిపై తెల్లవారుజామున పలువురు యువతీ యువకులు పుట్టిన రోజు వేడుకలు చేసుకున్నారు. కేక్‌లు కట్ చేస్తుండగా విషయం తెలుసుకున్న అలిపిరి సీఐ రాంకిషోర్ వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐతో పాటు ఎస్ఐ లోకేష్‌బాబు వారికి పలు సూచనలు చేశారు. మళ్లీ ఇలాంటి పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బధిరుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వినోద్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): బధిరుల సంక్షేమానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, వారికోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రా, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.వినోద్ అన్నారు. కలెక్టరేట్‌లో ఆదివారం ప్రపంచ బధిరులు, అంతర్జాతీయ సంజ్ఞాభాషల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన బి.వినోద్ మాట్లాడుతూ ప్రపంచంలో చాలా భాషలున్నా బధిరులకు మాత్రమే సొంతమైన సంజ్ఞా భాష ప్రత్యేకమైందన్నారు. ప్రభుత్వం బధిరుల ఉన్నత చదువుల కోసం రూ.8.4లక్షలతో 23 ల్యాప్‌టాప్‌లు, రూ.3.6లక్షలతో 24 టచ్‌ఫోన్లు, రూ.36వేలు విలువ చేసే చెవిటి మిషన్లు ఇచ్చిందని తెలిపారు. యూత్ ఫర్ జాబ్స్ ఫౌండేషన్ ద్వారా అర్హతను బట్టి ఉచితంగా శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి గురుస్వామిశెట్టి, డాక్టర్ రమణప్ప, ఎస్వీ యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్, వయోజన విద్య విభాగం అధిపతి ఆదినారాయణరెడ్డి, సంఘ నాయకులు కల్యాణ చక్రవర్తి, రెడ్డెప్ప పాల్గొన్నారు.

'మా డబ్బులు తీసుకుని మాపైనే దాడులా?'



మాట్లాడుతున్న బాధితులు గీత, జ్యోతి

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థలాలు ఇప్పిస్తామని తమ దగ్గర డబ్బు తీసుకుని మాపైనే దాడి చేయడం అన్యాయమని తిరుపతి రూరల్ సాయినగర్ పంచాయతీకి చెందిన గీత, జ్యోతి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ సాయినగర్ పంచాయతీకి చెందిన ఉమామహేశ్వరి ముళ్లపూడి గ్రామం వద్ద ప్లాటు ఇస్తామని నమ్మబలికి గ్రామ మహిళల వద్ద కోట్లాది రూపాయలు వసూలు చేసిందని తెలిపారు. 18మందికి పైగా రూ.2.70కోట్లు ఆమెకు నగదు రూపంలో ఇచ్చామని వెల్లడించారు. మూడేళ్లు కావస్తున్నా పట్టించుకోకపోవడంతో నిలదీశామని, దీంతో రాత్రికి రాత్రి ఇల్లు విడిచి పారిపోయిందని చెప్పారు. తర్వాత ఇల్లు తెలుసుకుని వెళ్లి నిలదీయగా ఆమె, ఆమె భర్త తమపై దాడి చేశారని తెలిపారు. ఎమ్మెల్యే పులివర్తి నాని స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గీత, మౌనిక, నాగలక్ష్మి, జమున, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

భూమన అసత్య ప్రచారాలు మానుకోవాలి : కోడూరు



విలేకరులతో మాట్లాడుతున్న కోడూరు బాలసుబ్రహ్మణ్యం తదితరులు

తిరుపతి(ఎంఆర్‌పల్లె), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అసత్య ప్రచారాలు మానుకోవాలని టీడీపీ నాయకుడు కోడూరు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ తాము ఆధారాలతో మాట్లాడుతుంటే భూమన అసత్యాలు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. పరకామణిలో రవికుమార్ దొంగలిస్తే మిగిలిన గజదొంగలు పంచుకున్నారన్నారు. దొంగ సొత్తును సెటిల్‌మెంట్ చేయడానికి మీకు అర్హత ఏముందని ప్రశ్నించారు. భూమన వ్యాఖ్యలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని తెలిపారు. రవికుమార్ ఆస్తులు లాక్కుని తనకేమి సంబంధంలేదని చెప్పడం విడ్డూరమన్నారు. పరకామణిలో దొంగతనం చేస్తే ఆ కేసును లోక్ అదాలత్‌కు ఇవ్వడానికి భూమన ఎవరని ప్రశ్నించారు. సీబీఐ విచారణ జరిగినా ఆయన తప్పించుకోలేరన్నారు.

పశ్చాత్తాపం చెందితే వదిలేస్తారా?



మాట్లాడుతున్న కిరణ్ రాయల్

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీవారి సొమ్మును దొంగిలించిన వ్యక్తి పశ్చాత్తాప పడితే వదిలేస్తారా అని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్ రాయల్ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో శ్రీవారి పరకామణిలో దొంగతనం జరిగిన మాట వాస్తవమేనన్నారు. దొంగతనం చేసిన రవికుమార్ బతికి ఉన్నాడో లేదో అనుమానంగా ఉందన్నారు. దేవుడి సొమ్ము దొంగతనం చేసిన వ్యక్తి వద్దే డబ్బులు వసూలు చేసిన వారిని ఏమనాలి అని ప్రశ్నించారు. రవికుమార్ బయటకు వస్తే అసలు బాగోతం వెలుగులోకి వస్తుందన్నారు. చోరీ జరిగింది రూ.100కోట్లు కాదని, రూ.300 కోట్లు అని అన్నారు. ఆ డబ్బులు భూమన, జగన్, ధర్మారెడ్డికి అందాయని ఆరోపించారు. పలువురు అధికారులకూ ముడుపులు ముట్టాయని, త్వరలోనే వాస్తవాలు బయటకు వస్తాయని అన్నారు. కరుణాకరరెడ్డి ఎన్ని కథలు చెప్పినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు.

మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలి

తిరుపతి(విద్య), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ - 2025 అభ్యర్థులకు మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా స్థానాలు ఎంచుకునే సదుపాయం కల్పించాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజీ, కార్యదర్శి సత్యనారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వందలాది ఖాళీలు ఉన్న సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు, ముఖ్యంగా కర్నూలు జిల్లాలోని 1,731 ఎస్జీటీ పోస్టులకు ఆన్‌లైన్‌లో ఆప్షన్ ఇవ్వడం నూతన ఉపాధ్యాయులకు ఎంతో కష్టతరమైన అంశమని పేర్కొన్నారు. అనుభవంలేని ఉపాధ్యాయుల ఇబ్బందిని అర్థం చేసుకుని మాన్యువల్ కౌన్సెలింగ్ అవకాశం కల్పించాలని కోరారు.

రసరమ్యం.. చిన్నమ్మదేవి గాత్రం



తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) : కేటీ రోడ్డులోని అరవిందో సొసైటీలో ఆదివారం సాయంత్రం స్వరభారతి ఆధ్వర్యంలో జరిగిన ఎస్వీ సంగీత నృత్య కళాశాల అధ్యాపకురాలు చిన్నమ్మదేవి గాత్రకచేరి రసరమ్యంగా సాగింది. నవరాగ మాలికా వర్ణం, జయ జయ స్వామిన్, నీదు చరణములే, గరుడ గమన, శంకరి శంకురు వంటి అంశాలను ఆమె మృదు మధురంగా ఆలపించి రసజ్ఞ శ్రోతలను ఆకట్టుకున్నారు. ఈ కచేరికి వయోలిన్‌తో ధీరజ్, మృదంగంతో ప్రసన్న వెంకటేష్ అనువైన వాయిద్య సహకారం అందించారు. అనంతరం అన్నమాచార్య ప్రాజెక్టు గాత్ర కళాకారుడు డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం అన్నమాచార్య సాహిత్య ప్రచారంలో ప్రముఖుల పాత్ర అనే అంశంపై ఉపన్యాసం చేశారు. అన్నమయ్య వంశీకులతోపాటు ఆధునిక వాగ్గేయకారుల వరకు అన్నమాచార్య సంకీర్తనలపై జరిగిన పరిశోధన ప్రచారాన్ని సోదాహరణంగా వివరించారు. అనంతరం కళాకారులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్వరభారతి ప్రధాన కార్యదర్శి శరద్యుతి, నిర్వాహకులు, ఎస్వీ కళాశాల వైలన్ విభాగాధిపతి డాక్టర్ కేవీ.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం కండి



మాట్లాడుతున్న మనోహర్ తదితరులు

తిరుపతిరూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలకు గ్రామ స్థాయిలో జనసేన పార్టీ కేడర్ సమాయత్తం కావాలని ఆ పార్టీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి దేవర మనోహర్ కోరారు. ఎమ్మార్‌పల్లెలోని ఫంక్షన్ హాల్‌లో ఆదివారం తిరుపతి రూరల్ మండల నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి నేతృత్వంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రతి ఓటరుకూ చేరేవిధంగా కృషి చేయాలన్నారు. ప్రతి గ్రామంలో కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. రాష్ట్ర కార్యదర్శి ఆకేపాటి సుభాషిణి, రూరల్ మండల ఇన్‌చార్జి యువిరాయల్, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ బుద్ధుడు కావాలి

స్వర్ణమాల పత్రీ




స్వర్ణమాల పత్రీ సన్మానంలో పీఎంసీ సభ్యులు, పిరమిడ్ మాస్టర్లు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ బుద్ధుడు కావాలనేదే బ్రహ్మర్షి పత్రీజీ ఆశయంగా ఆయన సతీమణి స్వర్ణమాల పత్రీ తెలిపారు. తిరుపతి మహతి ఆడిటోరియంలో జరుగుతున్న ధ్యాన మహాయజ్ఞంలో ఆరో రోజైన ఆదివారం సాయంత్రం ఆమె పాల్గొని మాట్లాడుతూ ఎంతోమంది మాస్టర్లు తమ అనుభవాలతో పలువురిని ధ్యానం వైపు నడిపించడం అభినందనీయమన్నారు. తిరుపతిలో ఈ మహాయజ్ఞం కార్యక్రమం అద్భుతమని పేర్కొన్నారు. పత్రీజీ కుమార్తె పరినితి పత్రీ మాట్లాడుతూ మనం ఎలా జీవించాలో నేర్పించిన మహానుభావుడు బ్రహ్మర్షి అని చెప్పారు. ధ్యాన మహాయజ్ఞం వైస్ ఛైర్మన్ సంగీత బాబు మాట్లాడుతూ పత్రీజీ ఆశయాలను ప్రపంచ వ్యాప్తంగా తీసుకెళ్లేందుకు పీఎంసీ కృషి చేస్తోందన్నారు. ఇందుకు సహకరిస్తున్న ధ్యానులకు, పిరమిడ్ మాస్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. అంతకు ముందు వయోలిన్ గణేష్ బృందం సంగీత నాద ధ్యానం అలరించింది. మూడు గంటలపాటు అఖండ సామూహిక ధ్యానం నిర్వహించారు. అనంతరం పీఎంసీ సభ్యులు, పిరమిడ్ మాస్టర్లు స్వర్ణమాల పత్రీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పీఎంజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బాలకృష్ణ, దాట్ల హనుమంతరాజు, జక్కా రాఘరావు, కంచి రఘురాం, ఆనంద్ పాల్గొన్నారు.



ధ్యానం చేస్తున్న నగరవాసులు



విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపులు

శరన్నవరాత్రులు ముగిసే వరకు అమలు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై సోమవారం నుంచి ప్రారంభమయ్యే దసరా శరన్నవరాత్రి మహోత్సవాల కారణంగా పోలీసులు ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

- హైదరాబాద్-విజయవాడ-హైదరాబాద్-విశాఖపట్నం మార్గంలో రాకపోకలు సాగించే భారీ వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగి హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి వాహనాలు చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి నల్లకుంట వద్ద దిగి హైదరాబాద్ మార్గంలోకి వెళ్లాలి.
- హైదరాబాద్ - మచిలీపట్నం-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగాలి. కేసరపల్లి మీదుగా మచిలీపట్నం చేరుకోవాలి. ఇటు నుంచి వెళ్లే వాహనాలు కేసరపల్లి వద్ద నుంచి చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కాలి.
- హైదరాబాద్-చెన్నై-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా గుంటూరు చేరుకుని అక్కడి నుంచి చెన్నై వెళ్లాలి. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.
- చెన్నై-విశాఖపట్నం-చెన్నై మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఒంగోలు, త్రోవగుంట, చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ బైపాస్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి చెన్నై వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.

ఇంద్రకీలాద్రికి దసరా శోభ

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

- ఈఏడాది 20 లక్షలమంది భక్తులు వస్తారని అంచనా
- 29న దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి స్నపనాది క్రతువు నిర్వహిస్తారు. తొలిరోజు అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిస్తారు. ఉదయం 8-8.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఏడాది దేశం నలుమూలల నుంచి ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వీఐపీల కోసం స్లాట్ విధానాన్ని తీసుకొచ్చారు. ఉదయం 7-9, మధ్యాహ్నం 3-5 గంటల వరకు కల్పిస్తారు. ఈ ఏడాది భక్తుల కోసం 20 లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల కారణంగా ఇంద్రకీలాద్రి విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా వెలుగుతోంది. 29వ తేదీ మూలానక్షత్రం రోజున అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

నేటి నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు



శ్రీశైలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభంకానున్నాయి. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం చేసి గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీక్షా సంకల్పం, కంకణపూజ, కంకణధారణ తదితర పూజలు నిర్వహించనున్నారు. భ్రమరాంబికాదేవి అమ్మవారు సోమవారం శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు భృంగి వాహన సేవ నిర్వహించనున్నారు.

ఉత్తరాంధ్రకు వాయు 'గండం'

- పిడుగులతో భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక
- బెజవాడలో 13 సెంటీమీటర్ల వర్షం.. నేడు ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రకు వాయు గుండం పొంచి ఉంది. ఈ నెల 26న వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం 27న ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాలకు ఎక్కువగా ఉంటుందని, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సోమవారం ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీంతో సోమ, మంగళవారాల్లో ఉత్తరాంధ్రలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 25న తూర్పుమధ్య, ఈశాన్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. మూడు రోజుల వ్యవధిలో ఏర్పడనున్న రెండు అల్పపీడనాల ప్రభావంతో ఈనెల 24 నుంచి 27 వరకు కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు, కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. విజయవాడ సింగ్‌నగర్‌లో 13, చిత్తూరు జిల్లాలోని కాగితలో 8.3, ఏలూరు జిల్లా కాకర్లమూడిలో 8, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో 6.9, చిత్తూరులోని యాదమర్రిలో 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు, ఒకట్రెండుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని నిపుణుడొకరు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభం వద్ద జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. న్యాయమూర్తి కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండప ప్రదక్షిణ చేసిన అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను జ్ఞాపికగా అందజేశారు.

నేటి నుంచి విశాఖలో 28వ జాతీయ ఈ గవర్నెన్స్ కాన్ఫరెన్స్

- ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుంది
- కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి

విశాఖపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ కాన్ఫరెన్స్‌ను ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్టు కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి వి.శ్రీనివాస్ వెల్లడించారు. విశాఖలో ఆదివారం మాట్లాడుతూ.. వికసిత్ భారత్, సివిల్ సర్వీసెస్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ థీమ్‌తో సదస్సు ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తారన్నారు. ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుందని, ప్రస్తు తం 738 రకాలు సేవలు అందిస్తున్నారని, దీనిని దేశంలోనే అత్యుత్తమ మోడల్‌గా అభివర్ణించారు. విశాఖ డిక్లరేషన్‌లో దీనిని భాగం చేసి దేశమంతా అమలు చేసేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా ప్రతినిధులు సదస్సులో పాల్గొంటారన్నారు. అత్యుత్తమ కార్యక్రమాలు నిర్వహించిన వారికి ఈ గవర్నెన్స్- 2025 అవార్డులు అందిస్తామన్నారు.

కూటమి నేతలపై అనుచిత పోస్టులు

- వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు



వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తో అంజాద్ ఖాన్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. కదిరి పట్టణానికి చెంది న కొలేపల్లి అంజాద్‌ఖాన్ అలియాస్ మెగా అంజాద్ వైసీపీ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తుండేవాడు. రెండ్రోజుల క్రితం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టడంతో అరెస్టు చేసినట్లు తెలిపారు.

27లోపు డిమాండ్లు పరిష్కరించాలి

- లేదంటే పెన్షన్ పంపిణీని నిలిపేస్తాం
- ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ

పెనమలూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 27 లోపు తమ డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్చలకు పిలవని పక్షంలో అక్టోబరు 1 నుంచి పెన్షన్ పంపిణీని నిలుపుదల చేసేందుకు వెనుకాడబోమని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ హెచ్చరించింది. పోరంకిలో ఆదివారం జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బగ్గా జగదీష్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో కలెక్టర్లకు, ఇతర అధికారులకు జేఏసీ తరఫున నోటీసులు అందజేస్తామన్నా రు. 26, 27 తేదీల్లో ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్న అఫిషియల్ వాట్సాప్ గ్రూపుల నుంచి ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా వైదొలుగుతారన్నారు. 28న రాయలసీమ వేదికగా కర్నూలు జిల్లాలో ప్రాంతీయ సమావేశం ఏర్పాటుచేసి తదుపరి కార్యాచరణను విడుదల చేస్తామని తెలిపారు.

తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలకు రేపు అంకురార్పణ

- ఎల్లుండి ధ్వజారోహణంతో ఉత్సవాలు ఆరంభం

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సాలకట్ల బ్రహ్మోత్సవాలను ప్రారంభించడానికి మంగళవారం అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయంలో సేనాధిపతిని అలంకరించి విశేష సమర్పణ గావిస్తారు. అనంతరం తిరుచ్చిపై ఆశీనులు చేస్తారు. రాత్రి ఏడు గంటలకు ఆలయం నుంచి బయల్దేరి నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత ఆలయానికి చేరుకున్న అనంతరం రంగనాయకమండపంలో ఆస్థానం జరుగుతుంది. యాగశాలలో అర్చకస్వాములు ఆగమోక్తంగా కైంకర్యాలు నిర్వహించి అంకురార్పణ(బీజవాపం) కార్యక్రమం నిర్వహిస్తారు. 24వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభవుతాయి.

తప్పుడు వార్తలను నమ్మకండి

- కపిలతీర్థంలో ఎలాంటి తొక్కిసలాట జరగలేదు: టీటీడీ

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో తొక్కిసలాట జరిగిందని, కపిలతీర్థంలో ఏర్పాట్లు చేయలేదని సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు వార్తలను భక్తులు నమ్మవద్దంటూ టీటీడీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. 'మహాలయ అమావాస్య సందర్భంగా తిరుపతి కపిలతీర్థం ఆలయం బయట ప్రైవేట్ వ్యక్తులు పితృతర్పణాల కార్యక్రమం చేసుకోవడం ఆనవాయితీ. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌ను టీటీడీ ఏర్పాట్లు చేసింది. రద్దీ నేపథ్యంలో భద్రతాపరంగా పటిష్ఠ చర్యలు తీసుకున్నాం. ఎస్పీ వాహనం, పోలీస్ వాహనం రావడంతో తొక్కిసలాట జరిగినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తిరుమలకు ఏమాత్రం సంబంధం లేకపోయినా ఇక్కడ తొక్కిసలాట అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కొంతమంది టీటీడీని లక్ష్యం చేసుకుని దుష్ప్రచారం చేయడం సరికాదు. టీటీడీ ప్రతిష్ఠను పలుచన చేయడాలని చూడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనం. ఇలాంటి వార్తలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అంటూ టీటీడీ తన సోషల్ మీడియా ద్వారా పేర్కొంది.

విజ్ఞాన్ వర్సిటీలో 62వ జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు విద్య, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్ మాట్లాడుతూ ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విశ్వనాథన్ ఆనంద్, హరికృష్ణ, హంపి, హరిదాసన్, ప్రగ్యానంద లాంటి ప్రతిభావంతులు దేశానికి ఎనలేని కీర్తి తెచ్చారని అశోక్ కొనియాడారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మొదటగా ఒక ఎత్తు వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ లాల్‌తమునా, చీఫ్ ఆర్బిటర్ అనంత రామన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ.సురేష్, చీఫ్ అడ్వయిజర్ కేవీవీ శర్మ, సెక్రటరీ కే.జగదీష్, గుంటూరు చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రవీంద్ర రాజు, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఆటగాళ్లు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీటీడీకి కానుకగా క్లీనింగ్ యంత్రాలు



టీటీడీకి ఆదివారం 18 క్లీనింగ్ యంత్రాలు కానుకగా అందాయి. కార్పొరేట్ సోషియల్ రెస్పాన్స్‌బిలిటీ (సీఎస్ఆర్)లో భాగంగా ఐడీబీఐ బ్యాంకు రూ.19 లక్షల విలువైన 18 క్లీనింగ్ యంత్రాలను అందజేసింది. ఆదివారం ఉదయం ఆలయం ముందు ఈ యంత్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బ్యాంకు ఎండీ, సీఈవో రాకేష్ శర్మ ఆలయ పేష్కార్ రామకృష్ణకు అందజేశారు. డిప్యూటీ ఈవో సోమన్నారాయణ, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, ఐడీబీఐ రీజనల్ హెడ్ సాయికృష్ణ, బ్రాంచ్ హెడ్ మేనేజర్ రమేష్, రాజేష్ పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

టీటీడీకి రైడ్ ఆన్ స్వీపర్ మిషన్ విరాళం

తిరుమల, సెప్టెంబరు21 (ఆంధ్రజ్యోతి): టీటీడీకి ఆదివారం రూ.20 లక్షల విలువైన రాస్ స్ట్రీట్ ఆర్‌ఓ 1500 రైడ్ ఆన్ స్వీపర్ మిషన్ విరాళంగా అందింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మల్టీ పర్పస్ క్లీనింగ్ కోసం ఉపయోగించేందుకు ఈ మిషన్‌ను అందజేసింది. ఈమేరకు ఆదివారం సాయంత్రం ఆలయం ముందు టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి బ్యాంక్ జీఎం పత్రి శ్రీనివాస్ మిషన్‌ను అందజేశారు. అనంతరం అదనపు ఈవో ఈ మిషన్‌ను కొద్ది దూరం నడిపి పనితీరును పరిశీలించారు.




శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 12 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శుక్రవారం హుండీ ఆదాయం: రూ.4.59 కోట్లు

శనివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 82,042

తలనీలాలు సమర్పించినవారు: 23,393





డ్రగ్స్‌కు నో చెబుదాం

జీవితాలను కాపాడుకుందాం

- యువతకు పిలుపునిచ్చిన ఎస్పీ సుబ్బరాయుడు
- ఘనంగా నమో యువరన్ 3కె ర్యాలీ

తిరుపతి(విద్య), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): 'డ్రగ్స్‌కు నో చెబుదాం. విలువైన జీవితాలను కాపాడుకుందాం. డ్రగ్స్ నిర్మూలనకు పోరాడుదాం. నవయుగ భారత్‌ను నిర్మిద్దాం' అంటూ ఎస్పీ సుబ్బరాయుడు యువతకు పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా బీజేవైఎం ఆధ్వర్యంలో ఆదివారం 'నమో యువ రన్ 3కె ర్యాలీ' ఆదివారం తిరుపతిలో జరిగింది. మత్తు పదార్థాలు శరీరానికి హాని చేయడంతో పాటు జీవితాలనూ నాశనం చేస్తాయని ఎస్పీ వివరించారు. ఒక్కసారి అలవాటుపడితే సర్వం కోల్పోతారన్నారు. ఎవరికైనా డ్రగ్స్ వాడినా, అమ్మినా ఆ వివరాలను రాష్ట్ర టోల్ ఫ్రీ నెంబరు 1972కు, తిరుపతి జిల్లా నెంబరకు 1908కు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. యుతను జాగృతం చేసేందుకు ఈ కార్యక్రమం నిర్వహించామని బీజేపీ రాష్ట్ర సంఘటనా మంత్రి మధుకర్, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌రెడ్డి తెలిపారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల నుంచి బాలాజీ కాలనీ, గాంధీరోడ్డు, తిలక్‌రోడ్డు మీదుగా తుడా ఇందిరా మైదానం వరకు కే రన్ సాగింది. వందలాది మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సభ్యుడు భాను ప్రకాష్ రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్, యువమోర్చా నాయకులు హరికృష్ణ, పృథ్వీ, కిషన్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

అలాగైతే అలిపిరిలో తల నరుక్కుంటా: భూమన



తిరుపతి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి పరకామణికి సంబంధించి తాను చైర్మన్‌గా ఉన్న సమయంలో ఘటన జరిగి ఉంటే అలిపిరి వద్ద తల నరుక్కుంటానని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి వ్యాఖ్యానించారు. అలా కాని పక్షంలో లోకేశ్, బీఆర్ నాయుడు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు.తిరుపతిలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'కొందరు సీసీ ఫుటేజ్ అంటూ హడావుడి చేస్తున్నారు. గత 20 ఏళ్లుగా పరకామణిలో రవికుమార్ చోరీ చేస్తున్నారని అంటున్నారు. అలా జరిగి ఉంటే గత చంద్రబాబు పాలనలో 15 సంవత్సరాలకు సంబంధించిన సీసీ ఫుటేజీని ఎందుకు బయట పెట్టడంలేదు. రవికుమార్‌ను మా ప్రభుత్వ హయాంలోనే పట్టుకున్నాం. ఈ ఘటనకు సంబంధించి ప్రాయశ్చిత్తంగా అతడి నుంచి రూ.14 కోట్ల మార్కెట్ విలువ చేసే ఆస్తులను టీటీడీకి అప్పగించడం జరిగింది. ఆ ఆస్తి విలువ రూ.100కోట్ల వరకు ఉంటుంది. సీబీసీఐడీ కాదు సీబీఐ చేత విచారణ జరిపించండి. ఏ విచారణనైనా ఎదుర్కొంటాం' అని పేర్కొన్నారు.

ఇద్దరు బిడ్డలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న తల్లీ బిడ్డలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ దుర్గసముద్రం పంచాయతీకి చెందిన దిల్షాద్‌బేగం ఆదివారం తన ఇద్దరు బిడ్డలకు విషమిచ్చి తానూ ఆత్మహత్యకు యత్నించారు. తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు.. కొద్ది రోజులుగా జగనన్న కాలనీకి చెందిన గాయత్రికి, కొందరు గ్రామస్థులకు తగాదా నడుస్తోంది. తనను కాలనీలోని కొందరు బెదిరిస్తున్నారని పీజీఆర్ఎస్‌లో గాయత్రి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో రూరల్ పోలీసులు మూడు రోజుల క్రితం దిల్షాద్‌బేగంను విచారించి పంపారు. ఈ నేపథ్యంలో దిల్షాద్ బేగంను గాయత్రి అవమానకరంగా మాట్లాడటం, తన గురించి అసభ్యకరంగా చెబుతుండటంతో కుటుంబంతో సహా చనిపోవాలని ఆమె భావించారు. ఆదివారం సాయంత్రం తన ఇద్దరు బిడ్డలకు (ఐదో తరగతి చదివే సంతోష్, ఒకటో తరగతి చదివే తేజ్‌కుమారి) పురుగుల మందు తాగించి.. తానూ తాగి ఆత్మహత్యకు యత్నించారు. స్థానికులు వెంటనే 108 అంబులెన్సులో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారు. సీఐ విచారణ చేసి కేసు నమోదు చేశారు.



శివప్రసాద్‌కు నివాళి అర్పిస్తున్న ప్రీతమ్

శివప్రసాద్‌కు ఘన నివాళి

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): చిత్తూరు మాజీ ఎంపీ దివంగత డాక్టర్ నారమల్లి శివప్రసాద్ ఆరవ వర్ధంతి సందర్భంగా ఆయన మనవడు, వీఎం గ్రూప్ అధినేత కేతన్ శివప్రీతమ్ నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులతో కలసి అగరాలలోని శివప్రసాద్ ఘాట్ వద్ద పుష్పాంజలి ఘటించారు.



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, టీటీడీబోర్డు మెంబర్ భానుప్రకాష్‌రెడ్డి

సృజనాత్మకతకు అద్దంపట్టిన కళాంగిని వేడుక

- ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ

ఏర్పేడు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రెండురోజుల పాటు జరిగిన కళాంగిని వేడుక ఔత్సాహిక విద్యార్థులు, సీనియర్ ఆర్టిస్టుల సృజనాత్మకతకు అద్దం పట్టాయని తిరుపతి ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ అన్నారు. ఏర్పేడులోని తిరుపతి ఐఐటీలో ఆర్ట్ క్లబ్ ఆధ్వర్యంలో కళాంగిని వేడుక పేరిట శనివారం ఆర్ట్ వర్క్‌షాప్ నిర్వహించగా ఆదివారం ఆర్ట్ ఎగ్జిబిషన్ జరిగింది. ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ, టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలనతో ఎగ్జిబిషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీటెక్, ఎంటెక్ రీసెర్చి వంటి కోర్సులతో నిత్యం బిజీగా ఉండే ఐఐటీ విద్యార్థులు ఆర్ట్ క్లబ్ తరఫున ఇలాంటి కార్యక్రమం చేపట్టడం సంతోషకరమన్నారు. రోజువారి చదువుల ఒత్తిడి నుంచి ఈ తరహా కార్యక్రమాలు మానసిక ఉపశమనం కలిగిస్తాయన్నారు. ఇదొక ఆట విడుపు మాత్రమే కాకుండా విద్యార్థుల్లోని ప్రతిభను, సృతజనాత్మకతను వెలికి తీస్తుందన్నారు. దీనికి ఐఐటీతో పాటు ఐసర్ విద్యార్థులు పాల్గొనడం మంచి పరిణామమన్నారు. తిరుపతి నుంచి సీనియర్ మహిళ ఆర్టిస్టులు వర్క్‌షాప్‌లో పాల్గొని ఐఐటీ, ఐసర్ విద్యార్థులకు వివిధ రకాల పెయింటింగ్‌లో శిక్షణ ఇచ్చారన్నారు. ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన ఔత్సాహిక విద్యార్థుల కళారూపాలు అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఈ తరహా కార్యక్రమాలను తరచూ నిర్వహించాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఐఐటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.కృష్ణకుమార్, డీన్ ఎస్ఎన్ మూర్తి, పీఆర్వో చమన్ మెహతా, ఆర్టిస్టులు అర్చన, గాయత్రిదేవి, శ్రీదేవి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

సెటిల్మెంట్ చేయడానికి మీరెవరు?

- భూమనకు టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ప్రశ్న



తిరుపతి(ఎంఆర్‌పల్లె), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): 'శ్రీవారి పరకామణిలో రవికుమార్ దొంగిలిస్తే మిగిలిన గజదొంగలు పంచుకున్నారు. ఆ దొంగ సొత్తును సెటిల్‌మెంట్ చేయడానికి మీరెవరు? మీకేం అర్హత ఉంది' అంటూ భూమన కరుణాకరరెడ్డిని టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి ప్రశ్నించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, పరకామణి చోరీ గురించి తనకు ఏం సంబంధంలేదని భూమన చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రవికుమార్‌పై కేసు పెట్టినప్పటినుంచి భూమన టీటీడీ పాలకమండలిలో ఉన్నారన్నారు. పరకామణి దొంగతనంపై సాక్ష్యాధారాలతో బయటపెట్టినప్పటి నుంచి ఆయనలో భయం పట్టుకుందన్నారు. రవికుమార్‌నుంచి భూమన రూ.400కోట్లు తీసుకున్నారన్నారు. భూమన టీటీడీ చైర్మన్‌గా ఉన్నపుడు స్విమ్స్‌లో మందుల షాపుల కాంట్రాక్టరు నుంచి కూడా ముడుపులు తీసుకున్నారని, త్వరలోనే అన్ని వాస్తవాలు బయటకు వస్తాయన్నారు.

పుత్తూరు వార్తలు

గూళూరు చెరువు సమస్య సరిష్కారమయ్యేనా?



ప్రమాదం అంచుల్లో ఆదిఆంధ్రవాడ ఇళ్లు

వడమాలపేట, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): నిండకుంటే చింత... నిండితే మంట అన్నట్లుగా ఉంది ఎస్బీఆర్ పురం గూళూరు చెరువు పరిస్థితి. ఆరేళ్లుగా ముంపు పట్టాలు పొందిన రైతుల బాధలు వర్ణనాతీతం. తూములకు మరమ్మతులు చేయడంలో సంబంధిత శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెరువు నిండుకుండలా మారింది. మరో భారీ వర్షం కురిస్తే ఎస్బీఆర్ పురంతోపాటు, ఆదిఆంధ్రవాడ మునిగి పోయే పరిస్థితి ఉంది. ఇరిగేషన్ పరిధిలో ఉన్న ఈ చెరువు 2480 ఏకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో 125 ఎకరాల మేరకు ముంపు పట్టాలున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నిండి కలుజు పారింది. ఇప్పటికీ నీరు చేరుతోంది. గత కొన్నేళ్ల గా మరమ్మతులు చేపట్టకపోవడంతో తూములు పూడి పోయాయి. దీంతో కాలువల ద్వారా వచ్చే నీటితో చెరువు నీటి మట్టం రోజురోజుకు పెరుగుతోంది. దీంతో దిగువ ప్రాంతంలోని ఆది ఆంధ్ర వాడవాసులు ఎప్పుడు ముంపుకు గురవుతామో అంటూ భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తూములకు మరమ్మతులు చేపట్టి నీటిని దిగువకు వదలాలని గ్రామస్తులు కోరుతున్నారు.

షటిల్ బ్యాడ్మింటన్‌లో దర్ష్ క్రీడాకారుల ప్రతిభ



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్వీ ఏ ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 18న జరిగిన స్కూల్ గేమ్స్ మండలస్థాయి పోటీల్లో షటిల్ బ్యాడ్మింటన్ విభాగంలో దర్ష్ బ్యాడ్మింటన్ అకాడమీ క్రీడాకారులు ప్రతిభ చూపారు. ఈ పోటీల్లో మండలవ్యాప్తంగా 24 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు పాల్గొనగా దర్ష్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు ధీరజ్(రత్నం), షోయబ్, సాత్విక(శ్రీచైతన్య), పూర్లష్(బాష్యం) విద్యార్థులు డివిజన్ స్థాయి పోటీలకు అర్హత సాధించారు. మండలస్థాయి బృందం నలుగురు కాగా నలుగురు దర్ష్ బ్యాడ్మింటన్ అకాడమీ చెందిన వారే కావడం విశేషం. వీరిని అకాడమీ నిర్వాహకులు సునీల్, కోచ్ పవన్‌కుమార్ అభినందించారు

పూర్తి కాని తరగతి గదులు

ఇబ్బందుల్లో విద్యార్థులు



కేవీబీపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగిగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో తరగతి గది నిర్మాణాలు పూర్తికాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. 2023లో నాడు-నేడు నిధులతో ప్రారంభించిన నిర్మాణాలు ఇప్పటికీ పూర్తి కాకపోవడంతో చెట్ల కింద, వరండాల్లోనే విద్యను బోధించాల్సి వస్తోంది. కూటమి ప్రభుత్వంలో అయినా అధికారులు స్పందించి తరగతి గదుల నిర్మాణాలు పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఎస్ఐ విశ్వనాథనాయుడు సేవలు మరువలేం



విశ్వనాథనాయుడిని సన్మానిస్తున్న సహచర ఉద్యోగులు

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌కండ్రిగ పోలీసుస్టేషన్ ఎస్ఐ విశ్వనాథనాయుడు సేవలు మరువలేనివని ఏపీ ట్రాన్స్‌కో ఏఎస్పీ జనార్దనాయుడు, శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, తిరుపతి స్పెషల్ బ్రాంచ్ డీఎ స్పీ వెంకటనారయణ అన్నారు. ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్న ఎస్ఐ విశ్వనాథనాయుడు సన్మానసభ సీఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి పట్టణంలోని ఓ కల్యాణమండపంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్ఐ విశ్వనాథనాయుడు 44 సంవత్సరాలు పాటు విధులు నిర్వహించారని, పోలీసులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఆయన సేవలను గుర్తించి ప్రభుత్వం పలు సత్కారాలు అందించించదన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి సీఐలు గోపి, నాగర్జునరెడ్డి, ఎస్ఐలు బలరాం, నరసింహారావు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మ జాతర ప్రారంభం



బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 21 (ఆంధరజ్యోతి): మండలంలోని కంచనపుత్తూరులో గంగ జాతర ఆదివారం ప్రారంభమైంది. మూడురోజుల పాటు గంగమ్మ విగ్రహానికి అభిషేకాలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వ హించనున్నారు. సోమవారం గంగమ్మ పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలు, మైలు ముగ్గుతీర్పు, కలశ ఉత్సవం, శేషపాన్పు చేపట్టనున్నారు. మంగళవారం ఉదయం అంబుళ్లు పోసిన అనంతరం గంగమ్మ ఉత్సవమూర్తి ఊరేగింపు, ఎదురు పొంగళ్లు జరుగుతాయని జాతర నిర్వాహకులు తెలిపారు.

సామాజిక న్యాయం కనబడటం లేదు

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో సామాజిక న్యాయం కనపడటంలేదని ఓబీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఉప్పర నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం చేపట్టిన ఆలయాల చైర్మన్ల నియామకాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీల జాడే లేదన్నారు. టీడీపీకి బీసీలే ఊపిరి అని పదేపదే చెప్పుకునే ఆ పార్టీ నాయకులు అమలు చేయడంలో వెనుకబడ్డారని ఎద్దేవా చేశారు. తాను బీసీని కాబట్టే టీడీపీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఇచ్చారని చెబుతున్న పల్లా శ్రీనివాస్ బీసీలకు అన్యాయం జరిగితే మౌనంగా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. బీసీలకు అన్యాయం చేసే పార్టీలకు వచ్చే ఎన్నికల్లో గుణపాఠం చెబుతామన్నారు

టీటీడీ కానుకగా క్లీనింగ్ యంత్రాలు

తిరుమల, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): టీటీడీకి ఆదివారం 18 క్లీనింగ్ యంత్రాలు కానుకగా అందాయి. కార్పొరేట్ సోషియల్ రెస్పాన్స్‌బిలిటీ (సీఎస్‌ఆర్)లో భాగంగా ఐడీబీఐ రూ.19 లక్షల విలువైన 18 క్లీనింగ్ యంత్రాలను అందజేసింది. ఆదివారం ఉదయం ఆలయం ముందు ఈ యంత్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బ్యాంకు ఎండీ, సీఈవో రాకేష్ శర్మ ఆలయ పేష్కార్ రామకృష్ణకు అందజేశారు. డిప్యూటీ ఈవో సోమన్నారాయణ, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్, ఐడీబీఐ రీజనల్ హెడ్ సాయికృష్ణ బ్రాచ్ హెడ్, మేనేజర్ రమేష్, రాజేష్ పాల్గొన్నారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

అన్నపూర్ణాదేవి ఆలయంలో మహాలయ అమావాస్య పూజలు

తడ, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మహాలయ అమావాస్యను పురస్కరించుకొని ఆదివారం మాంబట్టులో ఉన్న కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. స్వామివారికి విశేష పూజలు, సహస్రనామార్చన, గోపూజ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నపూర్ణాదేవి అన్నదాన సమాజం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో తిరుపతి సిమ్స్ వైద్యుడు మునస్వామి, టీడీపీ నాయకులు వేనాటి రాజారెడ్డి, సురేష్‌రెడ్డి, సర్పంచ్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మూకాంబికాదేవి ఆలయంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం

నాయుడుపేట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మూకాంబికాదేవి ఆలయంలో సోమవారం నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 22వ తేదీ సోమవారం మూకాంబికాదేవి అలంకరణ, 23న బాలత్రిపురసుందరిదేవి, 24న పార్వతీ దేవి, 25న గాయత్రిదేవి, 26న మహాలక్ష్మీదేవి, 27న అన్నపూర్ణాదేవి, 28న శ్రీలలితా త్రిపురసుందరిదేవి, 29న సరస్వతీదేవి, 30న దుర్గాదేవి, అక్టోబరు 1వ తేదీన మహిషాపుర మర్దినిదేవి, 2వ తేదీ రాజరాజేశ్వరి దేవి అలంకరణలో మూకాంబికాదేవి దర్శనమివ్వనున్నారు.

నేటి నుంచి నాగేశ్వరస్వామి ఆలయంలో...

సూళ్లూరుపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని గంగా పార్వతీ త్రినేత్ర సంభూతుడైన నాగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నుంచి దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ తాటిపర్తి ఆదినారాయణ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన పాలకమండలి సభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడుతూ అందరి సహకారంలో ఈ ఏడాది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. ఉత్సవాల్లో భాగంగా 22న పార్వతీదేవి అలంకారం, 23న అన్నపూర్ణాదేవి అలంకారం, 24న రాజరాజేశ్వరి, 25న గాయత్రిదేవి, 26న బాలత్రిపుర సుందరి, 27న మోహిని దేవి, 28న విజయలక్ష్మీ దేవి, 29న సరస్వతి దేవి, 30న మహిషాసురమర్దని, అక్టోబరు 1న చండీదేవి అలంకారం, 2న చివరిరోజు పార్వతీ పరమేశ్వర అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. అదే రోజు రాత్రి గ్రామోత్సవం వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు సునీల్ శర్మ, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

అధిక ధరలకు స్టాంప్ పేపర్లు

నాయుడుపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ స్టాంప్ పేపర్లను కొంత మంది వెండర్లు అధిక ధరలకు విక్రయిస్తున్నారని బీజేపీ మండల కార్యదర్శి సురేంద్రబాబు ఆదివారం ఆరోపించారు. రాజగోపాలపురంలోని ఓ వెండర్ రూ.20 స్టాంప్ పేపరును రూ.50కి అమ్ముతున్నారని, ఇదేంటని ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పలేదన్నారు. ఈ విషయమై జిల్లా రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు సురేంద్రబాబు చెప్పారు.



కోనేటిమిట్టలో ఆంజనేయస్వామి జెండాకు వీధోత్సవం నిర్వహిస్తున్న భక్తులు - ఉత్సవంలో కోలాటాలు

కోలాహలంగా జెండా ఉత్సవాలు

గూడూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గూడూరు పట్టణంలో ఆదివారం ఆంజనేయస్వామి జెండా ఉత్సవాలను కోలాహలంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి జెండాకు పూజలు నిర్వహించి వీధుల్లో మోస్తూ తప్పెట్లు, తాళాల మధ్య భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. అనంతరం ఆలయాల వద్ద జెండాను ప్రతిష్ఠించారు. రాత్రి తప్పెట్లు, తాళాలు, తెనాలి బ్యాండు, తీన్‌మార్, కేరళవాయిద్యాలు, కోలాటాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామోత్సవాలను వైభవోపేతంగా నిర్వహించారు. ప్రధానంగా గమళ్లపాళెం, తూర్పువీధి, కరణాలవీధి, మిట్టపాళెం, కోనేటిమిట్ట, కుమ్మరివీధి, అళఘనాథ స్వామి దేవస్థానం, సత్రపువీధి, నల జాలమ్మవీధి, వీరారెడ్డిపల్లి, తిలక్‌నగర్‌సెంటర్, ఇందిరానగర్, అశోక్‌నగర్, నరసింగరావుపేట, అడివయ్య కాలనీ, సిరామిక్ సెంటర్, మాళవ్యానగర్, ఐసీఎస్ రోడ్డు, రాజరాజేశ్వరీదేవి ఆలయంవీధి, అరుంధతీయనగర్ తదితర ప్రాంతాలలో జెండా ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. యువత చిందులతో సందడి చేశారు. ఉత్సవాల సందర్భంగా ఎటువంటి అల్లర్లు జరుగకుండా డీఎస్పీ గీతాకుమారి ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జెండా ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి బంధు మిత్రులు, ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసే స్థానికులు, సమీప గ్రామాల ప్రజలు తరలిరావడంతో గూడూరు పట్టణంలో సందడిగా మారింది.

నేడు కలశ స్థాపనతో శరన్నవరాత్రులు ప్రారంభం

పట్టణంలో వివిధ అమ్మవారి ఆలయాల్లో సోమవారం కలశ స్థాపనతో శరన్నవరాత్రులను ప్రారంభించనున్నారు. విజయదుర్గాదేవి ఉపపీఠం, నారాయణమ్మ పేరంటాళ్లు, మహాలక్ష్మమ్మ, కన్యకాపరమేశ్వరి, రాజరాజేశ్వరి, గంగమ్మ ఆలయం, మాళవ్యనగర్ మహాలక్ష్మమ్మ, ద్రౌపదీదేవి సమేత ధర్మరాజస్వామి, బజారువీధిల్లోని ఆలయాల్లో కలశ స్థాపనకు ఏర్పాట్లు పూర్తి చేశారు.



జెండా గ్రామోత్సవం ఎదుట తెనాలి బ్యాండు వాయిద్యాలు - ఆదిదేవ, అంధకాసుర వధ ఘట్టం నాటిక ప్రదర్శన సెట్టింగ్

పట్రాంగం ఆలయ నిధుల స్వాహాపై విచారణ

వాకాడు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పంట్రాంగం గ్రామంలోని పాండురంగేశ్వర, రామలింగేశ్వర ఆలయ నిధులు స్వాహాకు గురైనట్లు ఆరోపణలు రావడంతో ఆదివారం దేవదాయశాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టి, రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. పంట్రాంగం ఆలయ భూములు కౌలు వేలం ద్వారా వచ్చిన రూ.17 లక్షల సొమ్మును ఆలయ ఈవో స్వాహా చేసినట్లు ఆరోపణలు రావడంతో దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణారెడ్డి విచారణ చేపట్టారు. రికార్డులు స్వాధీనం చేసుకున్నారన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న దేవదాయశాఖ అధికారులు

ఎస్సీ వర్గీకరణను కలసికట్టుగా వ్యతిరేకిద్దాం

కోట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను కలసికట్టుగా వ్యతిరే కిద్దామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర నాయకులు మీజూరు మాధవ్, దాసరి సుందరం పిలుపునిచ్చారు. కోటలోని రెడ్డి కల్యాణ మండపంలో ఆదివారం మాలల జేఏసీ, ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి, బహుజన ఐక్యవేదిక నాయకులు భవిష్యత్తు ప్రణాళికపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ రాజ్యాంగ దినోత్సవాన్ని కోటలో ఘనంగా నిర్వహిస్తామని, ఈ బహిరంగ సభకు తిరుపతి, ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి వేలాదిగా మాల సోదరులు తరలిరావాలన్నారు. కార్య క్రమంలో మాలల జేఏసీ, ఐక్యవేదిక నాయకులు శ్రీనివాసరావు, హేమంత్, మల్లికార్జునరావు, మాలల ఉద్యోగులు పాల్గొన్నారు.



రౌండ్‌టెబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

హామీల అమలు కోసం ఉద్యమిస్తాం: విఠపు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

కోట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు కూటమి ఇచ్చిన హామీల అమలు కోసం కలసికట్టుగా ఉద్యమిద్దామని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పిలుపునిచ్చారు. కోటలోని రెడ్డికల్యాణ మండపంలో ఆదివారం యూటీఎఫ్ జిల్లా మధ్యంతర కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఎన్నో హామీలు ఇచ్చిందని, వాటి అమలు కోసం ఉద్యమబాట పడుతామన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులపై యాప్‌ల పనిభారం పెంచుతున్నారని, ఇది సరైన విధానం కాదన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు కోటేశ్వరరావు, రాజశేఖర్, మువ్వల మనోహర్, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలో ఇద్దరికి గాయాలు

కోట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టెడులో ఆదివారం పొలం విష యమై రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. వెంకటేశ్వర్లు, మహేంద్రపై అదే గ్రామానికి చెందిన చలపతి, నీలగిరి ఇనుపరాడ్‌తో దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను కోట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కరాటే పోటీల్లో నిహాల్ ప్రతిభ



జ్ఞాపికతో నిహాల్ మనోహర్

కోట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోటలోని ప్రగతి విద్యాసంస్థల్లో 4వ తరగతి చదువుతున్న నిహాల్ మనోహర్ జాతీయస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ చూపాడు. ఆదివారం నెల్లూరులోని సోమిశెట్టి కల్యాణ మండపంలో జాతీయ స్థాయి కరాటే పోటీలు జరిగాయి. ఇందులో నిహాల్ మనోహర్ క్యాంస పతకం సాధించాడు. నిహాల్ మనోహర్‌ను ప్రగతి విద్యాసంస్థల చైర్మన్ పసుపులేటి కిషోర్, కరాటే మాస్టర్ హరి బాబు అభినం దించారు.

శ్మశాన భూమి ఆక్రమణపై ఫిర్యాదు

బాలాయపల్లి, సెప్టెంబరు 21: మండలం లోని సుబ్రమణ్యం గ్రామంలో దళితుల శ్మశాన భూమిని అదే గ్రామానికి చెందిన కొందరు ఆదివారం ఎక్స్‌వేటర్‌తో చదును చేస్తుండగా దళితులు అడ్డుకున్నారు. ఆక్రణదారులపై పోలీ సులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి శ్మశానానికి హద్దులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉన్నతాధికారులు స్పందించి శ్మశాన భూమి ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

దివ్యాంగులకు కూరగాయలు



దివ్యాంగులకు కూరగాయలు అందజేస్తున్న జేవీవీ సభ్యులు

గూడూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఆదివారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విజయబాబు దాతృత్వంతో దివ్యాంగులకు కూరగాయలు, కోడి గుడ్లు పంపిణీ చేశారు. జేవీవీ పట్టణాధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, చెంచునారాయణ, సుబ్బారావు, ఆనంద్, రామ్మోహన్, గోపి, జగదీష్, ఇబ్రహీం, సుధీర్, శర్మ, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

తిరుపతిరూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట గ్రామంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే వార్షిక బ్రహోత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలంకార మండపం, వాహనాలను ఆలయ సిబ్బందితో వేదపాఠశాల విద్యార్థులు కలసి ఆదివారం శుద్ధి చేశారు. పరిసరాలను శుభ్రం చేశారు. ప్రధాన ఆలయంతోపాటు యాగశాల, అలంకారమండపం, కళ్యాణ మండపాలను అలంకరణ చేశారు.

స్వర్ణముఖినదిలో గల్లంతైన వృద్ధుడి మృతదేహం లభ్యం

పెళ్లకూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖినదిలో గల్లంతైన చమర్తి పాపయ్య(65) మృతదేహం ఆదివారం లభ్యమైంది. మండలంలోని చిల్లకూరు వడ్డిపాలెం గ్రామానికి చెందిన పాపయ్య శనివారం సాయంత్రం స్వర్ణముఖినదిని దాటుతుండగా గల్లంతయ్యాడు. శనివారం సాయంత్రం చీకటిపడే వరకు ఎస్ఐ నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం ఉదయం నుంచి రెస్క్యూ టీమ్‌తో కలిసి బోటులో గాలించగా సాయంత్రం దిరసనమాల సమీపంలో మృతదేహాన్ని గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. తెలిపారు.

బీజేపీ నాయకుల రక్తదానం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదినాన్ని పురష్కరించుకుని ఈ నెల 17నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహిస్తున్న పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం స్థానిక ఆర్అండ్‌బీ బంగ్లాలో బీజేపీ నాయకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆరణి విజయభాస్కర్ రెడ్డి, చెన్నకేశవులు, తన్నీరు శేషగిరిరావు, నూతపాటి శ్రీనివాసులు, కరుణాకర్‌రెడ్డి, తేజ, కోటయ్య గౌడ్, నాగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ఆదినారాయణరెడ్డి, సురేంద్రరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, బెజవాడ విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అభయ శంకరుడి ఆలయంలో అన్నదానం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మహాలయ అమావాస్య సందర్భంగా ఆదివారం టీడీపీ కార్యాలయం వద్దనున్న అభయ శంకరుడి ఆలయంలో అన్నదానం చేశారు. అభయ శంకరుడికి అభిషేకాలు చేసి పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

వైసీపీ జిల్లా కమిటీలో కోళ్లపూడికి చోటు

దక్కిలి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): వైసీపీ జిల్లా బీసీ విభాగ కమిటీ సభ్యుడిగా దక్కిలికి చెందిన కోళ్లపూడి వేణుగోపాల్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ అధిష్ఠానం ఆదివారం ప్రకటించింది. కొళ్లపూడి వేణుగోపాల్ మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దనరెడ్డికి ముఖ్య అనుచరుడు.

రోడ్లను బాగు చేయండి

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో రోడ్లను బాగు చేయాలంటూ స్థానికులు, ప్రజాసంఘాల నాయ కులు, సీపీఎం నేతలు నిరసన తెలిపారు. పట్టణంలోని పొగగొట్టంకాలనీ, అమరాగార్డెన్, అగ్రహారపేట, ట్రెజరీ వీధుల్లో గుంతలు ఏర్పడి రాకపోకలు సాగించడానికి అవస్థలు పడుతున్నారని స్థానికులు చెప్పారు. వర్షాకాలంలో విద్యార్థులు పాఠశాలకు వెళ్లి రావాలన్నా ఇబ్బందులు తప్పడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతుల పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం, ప్రజాసంఘ నాయకులు ముకుంద, విజయమ్మ, సుబ్బరత్నమ్మ, అజ్మ, హుస్సేనమ్మ, కరీముల్లా, గోవిందమ్మ, రాజమ్మ తదితరులు పాల్గొన్నారు.



గుంతల వద్ద స్థానికులు, ప్రజాసంఘాలు, సీపీఎం నేతల నిరసన

కోటలో జెండా ఉత్సవం



గూడలిలో ఆంజనేయస్వామి జెండాల ఊరేగింపు

కోట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి, శ్యామసుందరపురం, వెంకన్నపాళెం, తిన్నెలపూడి గ్రామాల్లో ఆదివారం జెండా ఉత్సవాలు జరిగాయి. ఆయా గ్రామాల్లో ఆంజనేయస్వామి జెండా, చిత్రపటాలతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అడుగడుగున కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. తిన్నెలపూడిలో చిన్నారులచేత కోలాటాలు ఆడించారు.

ముక్కంటి ఆలయ చైర్మన్‌కు అభినందనలు



సాయిప్రసాద్‌ను సత్కరిస్తున్న జనసేన నాయకులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్‌గా నియమితులైన కొట్టే సాయిప్రసాద్‌కు సూళ్లూరుపేట జనసేన నాయకులు అభినందనలు తెలిపారు. జనసేన మండల అధ్యక్షుడు ఆవుల రమణ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు షేక్ మా భాషా, ఆవుల దాసు, రామగిరి రేవంత్, చేని సూరి, శంఖు సురేష్, మహిళా నాయకురాలు పద్మజ, సుజాత ఆదివారం సాయిప్రసాద్‌ను కలిసి సత్కరించారు.

మానసిక వికాసం కోసం విజ్ఞాన తరగతులు

పెళ్లకూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత నిరుపేద విద్యార్థుల్లో మానసిక వికాసం పెంపొందించడానికి విజ్ఞాన తరగతులు నిర్వహించనున్నట్లు విశ్వమానవ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పెసల మస్తాన్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని పెన్నేపల్లి గ్రామంలో తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రం, విశ్వమానవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఇందులో విద్యార్థుల్లో మానసిక వికాసంతో పాటు శారీరక ఆరోగ్యం పెంపొందించడానికి క్రీడలు నిర్వహిస్తామన్నారు.

కాళంగి వంతెనపై వాహనాల రాకపోకల నిషేధం

సూళ్లూరుపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ ఆలయ సమీపంలో ఉన్న కాళంగి వంతెనపై వాహనాల రాకపోకలు నిషేధమని సీఐ మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. వంతెన బలహీనంగా ఉన్న నేపథ్యంలో భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ మేరకు కంపెనీలకు వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు, ట్రావెల్స్ యజమానులకు ఆదేశిచ్చామన్నారు.

నేడు అవనాక్షమ్మ నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ

నారాయణవనం, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాలను పురస్కరించుకుని నారాయణవనంలో కల్యాణ వెంకన్న ఆలయానికి అనుబంధంగా ఉన్న అవనాక్షమ్మ ఆలయంలో 22వ తేది సోమవారం నవరాత్రి ఉత్సవాలు అంకురార్పణతో ప్రారంభం అవుతుందని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. ఈనెల 23న మంగళవారం నవరాత్రి ఉత్సవాలను ధ్వజారోహణంతో ప్రారంభిస్తామని తెలిపారు. 23వ తేది అమ్మవారిని బాలత్రిపుర సుందరిగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తామన్నారు. 24న పార్వతి దేవిగా, 25న అన్నపూర్ణగా, 26న కామాక్షి దేవిగా, 27న కరుమారియమ్మగా, 28న మీనాక్షి దేవిగా, 29న ధనలక్ష్మిగా, 30న సరస్వతి దేవిగా, అక్టోబర్ 1వ తేది మహిషాసుర మర్ధినిగా భక్తులను కటాక్షించనున్నారు. అదే రోజు సాయంత్రం ధ్వజావరోహణంతో ఉత్సవాలు ముగుస్తాయి.

సిద్దేశ్వరాలయంలో ....

ఏర్పేడు మండలంలోని చిందేపల్లిలో కొలువై ఉన్న దాక్షాయని పార్వతిదేవి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 22న సోమవారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ధర్మకర్త గిరిధర్‌రెడ్డి తెలి పారు. 22న సోమవారం పార్వతిదేవి బాల త్రిపురసుందరిగా దర్శనమివ్వనున్నారు. 23న గాయత్రీదేవిగా, 24న అన్నపూర్ణా దేవిగా, 25న సంతానలక్ష్మీదేవిగా, 26న శ్రీమహా లక్ష్మిదేవిగా, 27న లలిత త్రిపుర సుందరిదేవిగా, 28న మహా చండిదేవిగా, 29న సరస్వతిగా, 30న దుర్గాదేవిగా, అక్టోబరు 1న మహిషాసుర మర్ధినిగా, 2న రాజరాజేశ్వరిగా దర్శనమివ్వనున్నారు.

ఘనంగా అమావాస్య ఉత్సవం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం అమావాస్య ఉత్సవం ఘనంగా జరిగింది. జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడి ఉత్సవమూర్తులకు ఆలయంలోని అలంకార మండపంలో విశేషంగా అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అలంకరించి ధూపదీప నైవేద్యాలను సమర్పించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామిఅమ్మవార్లు పురవీధుల్లో ఊరేగారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించారు.

పిచ్చాటూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామగిరి అంకాళపరమేశ్వరి ఆలయంలో ఆదివారం మహాలయ అమావాస్యను పురస్కరించుకుని అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు జరిగాయి. అనంతరం ఆలయ ఊంజల్ మండపంలో అమ్మవారు ఉత్సవమూర్తికి ఊంజల్ సేవ నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది.



విద్యుత్ దీపకాంతుల్లో కనకాచలం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా కనకాచలం కొండపై కొలువై ఉన్న కనకదుర్గమ్మ ఆలయం దసరా ఉత్సవాలకు సిద్ధమైంది. ఆలయ అధికారులు కొండపై భక్తులకు అవసరమైన ఏర్పాట్లను చేశారు. విద్యుత్ దీపకాంతులతో కనకాచలం మెరిసిపోతోంది.



రాజీవ్‌నగర్‌లో

కొండచిలువ కలకలం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని రాజీవ్‌నగర్ కాలనీలో ఆదివారం వేకువజామున కొండచిలువ కలకలం రేపింది. జనావాసాల్లోకి ప్రవేశించిన పది అడుగుల కొండచిలువ రెండు నాటుకోళ్లను మింగేసింది. ఈ సందర్భంగా చప్పుడు రావడంతో ఇరుగుపొరుగు వారు మేల్కొన్నారు. కొండచిలువ ఉన్నట్టు గుర్తించి అటవీశాఖ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని కొండచిలువను పట్టుకుని కైలాసగిరి రిజర్వాయర్ సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు,

జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడికి సన్మానం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా అవార్డు పొంది తిరుపతి జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీగా నియమితులైన కిషోర్‌ను శ్రీకాళహస్తిలో ఆదివారం ఘనంగా సత్కరించారు. దర్శ్ బ్యాడ్మింటన్ అకాడమీ వ్యవస్థాపకుడు సుధాకర్, సునీల్‌కుమార్, పవన్‌కుమార్, మురళీకృష్ణ, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

టీపీకోట రోడ్డులో ప్రయాణం నరకం!





చెరువును తలపిస్తున్న టీపీకోట రోడ్డు - వెళ్లూరు వద్ద అదుపు తప్పిన బస్సు

సత్యవేడు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు - నాగలాపురం వయా టీపీకోట రోడ్డు ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఈ రోడ్డు 25 కిలోమీటర్లు ధ్వంసమైంది. దీంతో ప్రయాణికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. గుంతలు, చెరువుల్లా మారిన ఈ మార్గంలో ఎప్పుడు, ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం ఈ రోడ్డు మీదుగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తిరిగి ఇంటికి చేరే వరకు తల్లిదండ్రులు భయంతో వెళ్లదీస్తున్నారు. ఇక శ్రీసిటీలో వివిధ పరిశ్రమలకు వెళుతున్న కార్మికుల సంగతి సరేసరి.

వైసీపీ పాపం... రోడ్డుకు శాపం

గత వైసీపీ ప్రభుత్వం చేసిన పాపం టీపీకోట రోడ్డుకు తీరని శాపంలా మారింది. అప్పటి ప్రభుత్వం ఈ ప్రాంతంలో గ్రావెల్ తవ్వకాలకు ఇబ్బడి ముబ్బడిగా అనుమతులు ఇవ్వడంతో నిత్యం వందలాది టిప్పర్లు చెన్నైకు ఓవర్‌లోడ్‌తో పరుగులు పెట్టాయి. రాత్రీపగలు తేడా లేకుండా భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు ధ్వంసమైంది. ఫలితంగా గత ఆరేళ్ల నుంచి ప్రజలు బాధలు అనుభవిస్తూనే ఉన్నారు. నాగలాపురం- టీపీకోట రోడ్డును చిన్నపాండూరు వరకు రూ.42 కోట్లతో విస్తరించేందుకు 2021లో అప్పటి మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, నారాయణస్వామి చేతుల మీదుగా భూమిపూజ జరిగింది. పెద్దిరెడ్డికి చెందిన పీఎల్‌ఆర్ కంపెనీ ఈ పనులను దక్కించుకుంది. అయితే ఒక్క అంగుళం పనులు కూడా నిర్వహించకుండా శిలాఫలకంతోనే సరిపెట్టేసింది. కూటమి ప్రభుత్వంలోనైనా తమ కష్టాలు తీరతాయని ఎదురుచూసిన ప్రజలకు ఇప్పటికీ నిరాశే మిగిలింది. దీంతో ఈ రోడ్డు పూర్తిగా 25 కిలోమీటర్ల వరకు పెద్ద పెద్ద గుంతలు, చెరువులుగా మారి సుమారు 30 గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించలేక అష్టకష్టాలు పడుతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వాహనాలు అదుపు తప్పి కాలువలు, పొలాల్లోకి దూసుకెళుతున్నాయి. ద్విచక్రవాహన దారులు గాయాల పాలవుతున్నారు. ఇటీవల సత్యవేడు ఆర్టీసీ బస్సు అదుపు తప్పి పొలాల్లోకి, ఓ ప్రైవేట్ కళాశాల బస్సు కాలువలోకి దూసుకెళ్లాయి. శ్రీసిటీకి కార్మికులతో వెళుతున్న బస్సు అదుపు తప్పి బోల్తా పడింది. ఓ గర్భిణీని ఆస్పత్రికి తరలిస్తున్న 108 వాహనం జాయింట్ వీల్ విరిగి ఆగిపోయింది. తాజాగా ఆదివారం నాగలాపురం నుంచి ప్రయాణికులతో సత్యవేడుకు బయల్దేరిన ఆర్టీసీ బస్సు మార్గమధ్యంలో వెళ్లూరు మలుపు వద్ద ఎదురుగా వస్తున్న మరో బస్సుకు సైడ్ ఇచ్చే క్రమంలో అదుపు తప్పి పక్కకు వాలిపోయింది. అప్రమత్తమైన డ్రైవర్ ప్రయాణికులను వెంటనే కిందకు దించేయడంతో ప్రమాదం తప్పింది. ఆ సమయంలో బస్సులో సుమారు 70మంది ప్రయాణికు లున్నారు. ఇలా ప్రతిరోజు ప్రమాదాలతో ప్రయాణించాల్సిన దుస్థితి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా స్పందించాల్సి ఉంది.

భక్తులకు అన్నదానం



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పీవీరోడ్డులో కొలువై ఉన్న అంకాలమ్మ ఆలయం వద్ద ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. నాలుగు సంవత్సరాలుగా ప్రతి అమ్మవాస్యకు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. యశ్వంత్‌రావు, సత్యనారాయణరావు, కార్తీక్‌రావు పాల్గొన్నారు.

పంట పొలాల్లో

గుర్తుతెలియని వ్యక్తి మృతి



రేణిగుంట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుత్తివారిపల్లి సచివాలయ సమీపంలోని పంట పొలాల్లో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని ఆదివారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతుడి వివరాలను ఆరాతీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రుయా ఆస్పత్రికి తరలించారు. అతిగా మద్యం తాగడం వల్లే మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

బ్రహ్మోత్సవాల భద్రతపై సమీక్ష



అధికారులతో చర్చిస్తున్న డీఎస్పీ

రేణిగుంట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): రేణిగుంట రైల్వేస్టేషన్ అధికారులతో తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని చేపట్టాల్సిన చర్యలపై ఆదివారం పోలీసులు సమీక్షించారు. స్టేషన్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ఈ సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ... బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. స్టేషన్ మాస్టర్ సీఎస్ రెడ్డి, ఐపీఎఫ్ వెంకటేశ్వర్, సీఐలు జయచంద్ర, మంజునాథ్‌రెడ్డి, జీఆర్‌పీ ఎస్‌ఐ మధుసూదన్, ఆర్టీసీ కంట్రోలర్ గోవర్ధన్ నాయుడు, ట్యాక్సీ, ఆటో స్టాండు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

కర్మక్రియ మండపంలో కానరాని వసతులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం సమీపంలోని స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న కర్మక్రియల మండపంలో కనీస వసతులు కల్పించకపోవడం దారుణమని హిందూ ధార్మిక సంఘ సభ్యుడు గరికపాటి రమేష్‌బాబు అన్నారు. మహాలయ అమావాస్య కావడంతో పితృదేవతలకు పలువురు పిండ ప్రదానం చేశారన్నారు. తగిన ఏర్పాట్లను ఆలయ అధికారులు చేయకపోవడంతో ఇబ్బంది పడ్డారన్నారు. అధికారులు స్పందించి కర్మక్రియల మండపం వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు.

శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం ఏర్పాటు చేయాలి

పిచ్చాటూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలంలోని ప్రముఖ పవిత్ర క్షేత్రమైన వేదనారాయణ స్వామి ఆలయంలో శ్రీకృష్ణ దేవరాయలు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రాయల్ పీపుల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రెడ్డిశేఖర్ రాయల్ డిమాండ్ చేశారు. పిచ్చాటూరు పట్టణంలోని టీచర్స్ కాలనీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎల్‌ఐసీలో అత్యధిక పాలసీలు విక్రయించి గిన్నిస్ రికార్డులో స్థానం సంపాదించిన వి.త్యాగరాజన్ సత్కరించారు. గోపిరాయల్, సుబ్రహ్మణ్యం, ఆటో బాలాజీ, ఠాగూర్, శ్రీనివాస రాయల్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు





ఆలయం వద్ద జస్టిస్ కేజే థాకర్, జస్టిస్ అను శివరామన్, ఏలూరు అగ్రికల్చర్ యార్డు చైర్మన్ పార్థసారథి

శ్రీకాళహస్తి,సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని ఆదివారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. కర్ణాటక ఎమ్మెల్యే మల్లికార్జున మాదల్, తమిళనాడు అడిషనల్ ఐజీ అన్బు, గుజరాత్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కేజే థాకర్, కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ అను శివరామన్, మహారాష్ట్ర ఎస్పీ ప్రశాంత్ అమృత్కర్, ఏలూరు అగ్రికల్చర్ యార్డు చైర్మన్ పార్థసారథి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.



తాగునీరు కలుషితం



కేవీబీపురం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): తాగునీరు కలుషితమవుతోందని కేవీబీపురం దళితవాడవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైపు లీకేజీ కావడంతో అందులోనే మురుగు కలుస్తోందని చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే మురుగు నీటి కాలువలు నిర్మించాల్సి ఉంది.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



రేణిగుంట, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించాలని బీజేపీ రాష్ట్ర సంఘటన్ నూకల మధుకర్ అన్నారు. రేణిగుంట పీహెచ్‌సీలో ప్రధాని మోదీ జన్మదిన పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం మొక్కలు నాటారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్, నాయకులు బీడీ బాలాజి, చంద్రప్ప, సుబ్రహ్మణ్యంరెడ్డి, తేజోవతి తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణముఖిలో గల్లంతైన బాలుడి మృతి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈత సరదాతో స్వర్ణముఖి నదిలోకి వెళ్లిన హారున్ మృతి చెందడంతో పాటు అని స్నేహితుడు గుణ గల్లంతైన విషయం తెలిసిందే. శ్రీకాళహస్తి పట్టణంలోని దోబీఘాట్ వద్ద స్వర్ణముఖి నదిలో గల్లంతైన గుణ కోసం శ్రీకాళహస్తి 1వ పట్టణ పోలీసులు ఆదివారం గాలింపు చేపట్టారు. గుణ మృతదేహంను వెలికి తీసి శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చ్యురీకి తరలించారు. ఇద్దరు చిన్నారుల మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తి చేసి కుటుంబసభ్యులకు అప్పగించారు.



గుణ మృతదేహం

చిన్నారుల కుటుంబాలను ఆదుకోండి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి నదిలో ఈతకు వెళ్లి మృతి చెందిన ఇద్దరు చిన్నారుల కుటుంబాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు అన్నారు. శనివారం రాత్రి ఈతకు వెళ్లి హారున్ మృతి చెందగా, గుణ గల్లంతైన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం వైసీపీ నాయకులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సాయంతో గుణ మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వి.రమేష్, పఠాన్ ఫరీద్, సూరా సురేష్, కంఠా ఉదయ్‌కుమార్, బుల్లెట్ జయశ్యామ్, సాధన మున్నా రాయల్, జంలేషా, అస్లాం, సాదిక్, మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబీకులను పరామర్శిస్తున్న వైసీపీ నాయకులు